

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 22-03-2026 | సంపుటి - 27 | సంచిక -299 | రూ : 4 | పేజీలు: 8


## 3 దశల్లో..
# భద్రాచలం ఆలయాభివృద్ధి

- మంత్రులు, అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష




హైదరాబాద్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రమూర్తి ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మూడు దశల్లో అభివృద్ధి పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి తొలిదశ పనులు పూర్తిచేసే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఇప్పటివరకు పూర్తయిన భూసేకరణకు అనుగుణంగా ఆలయాభివృద్ధికి సంబంధించిన పలు డిజైన్లను సీఎం పరిశీలించారు. ఆయన శనివారం తన నివాసంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అధికారులతో సమీక్షించారు. వచ్చే గోదావరి పుష్కరాల నాటికి చేయగలిగిన పనులను ముందుగా గుర్తించి..

తరువాయి 2లో

## నగరం పరుగెడుతోంది..
# ప్రజారవాణా పడుతూ లేస్తోంది!

- తొమ్మిదేళ్లలో 500 తగ్గిన సిటీ బస్సులు
- ఆదరణ కోల్పోతున్న ఎంఎంటీఎస్‌లు
- పెరగని మెట్రో రైళ్ల ఫ్రీక్వెన్సీ, కోచ్‌లు
- ఇదే కొనసాగితే 'వాయు'గండంగా మెట్రో సిటీ



హైదరాబాద్: రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో జనాభాతో పాటు ప్రైవేటు వాహనాలు పెరుగుతున్నాయి. దీంతో రోడ్లపై వాయు కాలుష్యం అధికమవుతోంది. దక్షిణాదిలోని మిగతా మెట్రో నగరాలైన చెన్నై, బెంగళూరుతో పోలిస్తే పీఎం 10 ఉద్గారాలూ హైదరాబాద్‌లోనే అధికం. పరిస్థితి ఇలానే కొనసాగితే కాలుష్యంలో ఢిల్లీతో పోటీపడతామని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం లోపభూయిష్టమైన ప్రజారవాణానే అనేది తేటతెల్లం. ప్రజారవాణాలోని ప్రయాసలను భరించలేక ఎక్కువ మంది వ్యక్తిగత వాహనాలనే వినియోగిస్తున్నారు. దీంతో నగరం 'వాయు'గండంగా మారుతోంది. మెట్రో వచ్చినా.. డిమాండ్‌కు తగ్గట్టు సర్వీసులు, కోచ్‌లు పెరగకపోవడం, చివరి గమ్యస్థానం వరకు చేరడానికి అనుసంధాన ప్రజారవాణా లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. సమయపాలన లేని ఎంఎంటీఎస్‌లు ఆదరణ కోల్పోతున్నాయి. సిటీ బస్సులూ గత తొమ్మిదేళ్లలో వందల్లో తగ్గిపోయాయి. ఇదే సమయంలో ఢిల్లీ, ముంబయి నగరాలు మెట్రో, ఎంఎంటీఎస్ సేవల వినియోగంలో ఆదర్శంగా నిలుస్తున్నాయి.

తరువాయి 2లో



## ఇరాన్‌పై దాడులు
# మరింత తీవ్రం చేస్తాం

2లో

- యుద్ధం లక్ష్యాలను సాధించేవరకు ఆపేది లేదని స్పష్టీకరణ
- ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త వైమానిక దాడులు ఉధృతం చేస్తామన్న కాట్జ్
- ఆ దేశ పాలనా యంత్రాంగం, కమాండర్లను లక్ష్యంగా చేసుకుంటామని వెల్లడి

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేశ్..

2లో


## మా జోలికి రావొద్దు..
# బ్రిటన్‌కు ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్

2లో



- ఇరాన్‌పై దాడికి అమెరికాకు సహకరించొద్దని బ్రిటన్‌కు అరాఘ్చీ హెచ్చరిక
- తమ సైనిక స్థావరాలను వాడనిస్తే తీవ్ర పరిణామాలుంటాయంటూ వార్నింగ్
- బ్రిటన్ ప్రధాని సొంత ప్రజల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తున్నారని ఆరోపణ
- తమ ప్రయోజనాలపై దాడి చేయొద్దని ఇరాన్‌కు యూకే ప్రతి హెచ్చరిక

## ఇరాన్ అధ్యక్షుడికి మరోసారి
# ప్రధాని మోదీ ఫోన్..
### పశ్చిమాసియా యుద్ధంపై కీలక చర్చ




2లో


- ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌తో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని మోదీ
- ఈద్, నౌరూజ్ పండుగల సందర్భంగా శుభాకాంక్షల వెల్లడి
- పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం నెలకొనాలని ఆకాంక్ష
- మౌలిక సదుపాయాలపై దాడులను తీవ్రంగా ఖండించిన భారత్
- నౌకాయాన స్వేచ్ఛ, రవాణా మార్గాల భద్రతపై నొక్కిచెప్పిన మోదీ

## వచ్చే నెలలో రాష్ట్రానికి
# ప్రధాని మోదీ?

- హైదరాబాద్‌లో బహిరంగ సభ!
- వరంగల్ కోచ్ ఫ్యాక్టరీతోపాటు పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

2లో





## అమరావతికి
# 'క్వాంటమ్' కళ


- చురుగ్గా భవన నిర్మాణ పనులు
- 44 అంతస్తుల టవర్లు రెండు నిర్మించనున్న ప్రభుత్వం
- డిసెంబరు నాటికి ప్రపంచంలోనే అత్యాధునిక కంప్యూటర్ ఏర్పాటు

2లో

## 'స్కిల్స్' పరిధిలోకి
# ఏటీసీలు, పాలిటెక్నిక్‌లు

- ఉన్నత విద్యాశాఖ కిందకు నైపుణ్య విశ్వవిద్యాలయం
- రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి ఇక రద్దు

2లో



# నగరం పరుగెడుతోంది.. ప్రజారవాణా పడుతూ లేస్తోంది!

హైదరాబాద్: రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో జనాభాతో పాటు ప్రైవేటు వాహనాలు పెరుగుతున్నాయి. దీంతో రోడ్లపై వాయు కాలుష్యం అధికమవుతోంది. దక్షిణాదిలోని మిగతా మెట్రో నగరాలైన చెన్నై, బెంగళూరుతో పోలిస్తే పీఎం 10 ఉద్గారాలూ హైదరాబాద్‌లోనే అధికం. పరిస్థితి ఇలానే కొనసాగితే కాలుష్యంలో దిల్లీతో పోటీపడతామని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం లోపభూయిష్టమైన ప్రజారవాణానే అని తేటతెల్లం. ప్రజారవాణాలో ప్రయాణాలను భరించలేక ఎక్కువ మంది వ్యక్తిగత వాహనాలనే వినియోగిస్తున్నారు. దీంతో నగరం 'వాయు'గండంగా మారుతోంది. మెట్రో వచ్చినా.. డిమాండ్‌కు తగ్గట్టు సర్వీసులు, కోచ్‌లు పెరగకపోవడం, చివరి గమ్యస్థానం వరకు చేరడానికి అనుసంధాన ప్రజారవాణా లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. సమయపాలన లేని ఎంఎంటీఎస్‌లు ఆదరణ కోల్పోతున్నాయి. సిటీ బస్సులూ గత తొమ్మిదేళ్లలో వందల్లో తగ్గిపోయాయి. ఇదే సమయంలో దిల్లీ, ముంబయి నగరాలు మెట్రో, ఎంఎంటీఎస్ సేవల వినియోగంలో ఆదర్శంగా నిలుస్తున్నాయి. హైదరాబాద్ మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ (ఎంఎంటీఎస్) ఒకప్పుడు నగర ప్రజారవాణా వ్యవస్థలో కీలకంగా నిలిచింది. కరోనాకు ముందు రోజుకు సుమారు 1.20 లక్షల మంది వరకు ఎంఎంటీఎస్‌లో ప్రయాణించేవారు. ప్రస్తుతమా సంఖ్య 45 వేలకు పడిపోయింది. టికెట్ ధర తక్కువే అయినా సమయపాలన లేకపోవడంతో ఆదరణ తగ్గుతోంది. ముంబయిలో ప్రజారవాణాకు లోకల్ రైల్ల వ్యవస్థ జీవనాడి. అక్కడ నాన్ ఏసీ, ఏసీ లోకల్ రైళ్లు నడుస్తుండటం, ఉదయం 4 నుంచే అందుబాటులో ఉంటుండటంతో వాటికి మంచి డిమాండ్ ఉంది. హైదరాబాద్ మెట్రోలో ప్రస్తుతం మూడు కోచ్‌ల రైళ్లు 57 నడుస్తున్నాయి. రద్దీ సమయాల్లో అదనంగా 50 కోచ్‌లు జోడించే ప్రతిపాదన ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. గతేడాది రోజుకు 4.40 లక్షలుగా ఉన్న ప్రయాణికుల సంఖ్య ఇప్పుడు 4.28 లక్షలకు పడిపోయింది. రద్దీవేళల్లో సగటున 4 నిమిషాలకు, రద్దీలేని వేళల్లో 6 నిమిషాలకు ఒక మెట్రో నడుస్తోంది. జేబీఎస్-ఎంజీబీఎస్ మార్గంలో 12 నిమిషాలకు ఒక మెట్రో నడుపుతున్నారు. సరిపడ కోచ్‌లు లేకపోవడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో విపరీతమైన రద్దీ ఉంటుండటంతో వేల మంది మెట్రోకి దూరమవుతున్నారు. ఇటీవల ప్రభుత్వం 10 మెట్రోరైళ్లను కొనేందుకు నిర్ణయించింది. దిల్లీలో మెరుగ్గా..: దేశ రాజధాని దిల్లీలో 12 కారిడార్లలో 394 కి.మీ. పరిధిలో మెట్రోరైలు మార్గం అందుబాటులో ఉంది. 289 మెట్రో స్టేషన్ల ద్వారా నిత్యం సగటున 80 లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నారు. స్టేషన్ల నుంచి గమ్యస్థానం చేరేందుకు మినీ బస్సులు, సైకిళ్లు, ఇతర రవాణా సాధనాలు అందుబాటులో ఉన్నాయి. దిల్లీ మెట్రో విజయవంతం కావడంలో ఇది కూడా కీలకం. ఎప్పటికప్పుడు నెట్‌వర్క్‌ను విస్తరిస్తున్నారు. ముంబయిలో పీఆర్‌టీ: ముంబయిలో రద్దీగా ఉండే ప్రాంతాల్లో బాంద్రా కుర్లా ఒకటి. ప్రయాణికులను ట్రాఫిక్ సమస్యలు లేకుండా వేగంగా గమ్యస్థానం చేర్చేందుకు అక్కడి ప్రభుత్వం సరికొత్త రవాణాకు శ్రీకారం చుట్టింది. సుమారు 8.8 కి.మీ. మార్గంలో పర్సనలైజ్డ్ ర్యాపిడ్ ట్రాన్సిట్ (పీఆర్‌టీ) వ్యవస్థను నిర్మిస్తోంది. ఇది ఎలివేటెడ్ కారిడార్. రహదారి ట్రాఫిక్ సమస్యలతో పనిలేకుండా ప్రయాణికులను వేగంగా గమ్యస్థానాలకు చేరుస్తుంది.

## వచ్చే నెలలో రాష్ట్రానికి ప్రధాని మోదీ?

హైదరాబాద్: కేంద్రం నిధులతో రాష్ట్రంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేపట్టేందుకు ప్రధాని మోదీ ఏప్రిల్ మొదటి వారంలో హైదరాబాద్ రానున్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా నగరంలో భారీ బహిరంగ సభకు హాజరై.. అక్కడి నుంచే వర్చువల్‌గా వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడతారని సమాచారం. వరంగల్‌లో రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, బీబీనగర్ ఎయిమ్స్‌లో కొత్తగా నిర్మించిన పలు బ్లాకులు, పలు జాతీయ రహదారుల ప్రారంభోత్సవాలతో పాటు హైదరాబాద్ నుంచి యాదాద్రి వరకు ప్రతిపాదిత ఎంఎంటీఎస్ రైల్వే ప్రాజెక్టు, ప్రాంతీయ వలయ రహదారి (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి శంకుస్థాపన చేయనున్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత మోదీ రాష్ట్రానికి తొలిసారి రానున్నారని, ఈ సందర్భంగా భాజపా తరఫున ఘనస్వాగతం పలకాలని శనివారం సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్‌లో జరిగిన పార్టీ నేతల సమావేశంలో సూత్రప్రాయంగా నిర్ణయించారు. ప్రధాని అధికారిక పర్యటన షెడ్యూలుపై త్వరలో స్పష్టత రానుందని సమాచారం.

## 3 దశల్లో భద్రాచలం ఆలయాభివృద్ధి

హైదరాబాద్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రమూర్తి ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మూడు దశల్లో అభివృద్ధి పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి తొలిదశ పనులు పూర్తిచేసే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఇప్పటివరకు పూర్తయిన భూసేకరణకు అనుగుణంగా ఆలయాభివృద్ధికి సంబంధించిన పలు డిజైన్లను సీఎం పరిశీలించారు. ఆయన శనివారం తన నివాసంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అధికారులతో సమీక్షించారు. వచ్చే గోదావరి పుష్కరాల నాటికి చేయగలిగిన పనులను ముందుగా గుర్తించి.. అంచనాలతో తొలిదశ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పుష్కరాల ప్రణాళికలకు అనుగుణంగా ఆలయ సమీపంలోని ఘాట్ల నిర్మాణం, అభివృద్ధి ఉండాలన్నారు. పుష్కరాలు ముగిసిన అనంతరం మిగతా పనులు పూర్తి చేసేందుకు ఇప్పుడే ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. ఆలయ సహజత్వానికి భంగం కలగకుండా పూర్తిగా ఆగమశాస్త్రానుసారం పనులు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, బలరాంనాయక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శులు శేషాద్రి, శ్రీనివాసరాజు, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ సంస్థ ఎండీ ఈవీ నరసింహారెడ్డి, ఆలయ ఈఓ, పూజారులు పాల్గొన్నారు.

## ఇరాన్ అధ్యక్షుడికి మరోసారి ప్రధాని మోదీ ఫోన్..

పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు, యుద్ధ వాతావరణం ఉగ్రరూపం దాల్చుతున్న తరుణంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ మసూద్ పెజెష్కియన్‌తో మరోసారి ఫోన్‌లో సంభాషించారు. శనివారం జరిగిన ఈ ఫోన్ కాల్‌లో మోదీ ఇరాన్ ప్రజలకు ఈద్, నౌరూజ్ (పర్షియన్ నూతన సంవత్సరం) పండుగల సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇరువురు నేతలు ప్రాంతీయ భద్రత, స్థిరత్వంపై కీలక అంశాలను చర్చించుకున్నారు. ఇజ్రాయెల్, అమెరికాతో ఇరాన్ ఘర్షణ పూరిత వాతావరణంలో ఉన్న నేపథ్యంలో ఈ సంభాషణకు దౌత్యపరంగా ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సంభాషణ వివరాలను ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతా ద్వారా పంచుకున్నారు. "ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ మసూద్ పెజెష్కియన్‌తో మాట్లాడాను. ఈద్, నౌరూజ్ శుభాకాంక్షలు తెలియజేశాను. ఈ పండుగల సమయం పశ్చిమాసియాకు శాంతి, స్థిరత్వం, శ్రేయస్సును తీసుకురావాలని ఆకాంక్షించాం" అని మోదీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. పండుగ వాతావరణంలో శాంతియుత వాతావరణం నెలకొనాలని ఇరువురు నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చర్చల సందర్భంగా, పశ్చిమాసియాలోని కీలక మౌలిక సదుపాయాలపై జరుగుతున్న దాడులను ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దాడులు ప్రాంతీయ స్థిరత్వానికే కాకుండా, ప్రపంచ సరఫరా గొలుసులకు కూడా తీవ్ర అంతరాయం కలిగిస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో, అంతర్జాతీయ వాణిజ్యానికి జీవనాడి అయిన నౌకాయాన స్వేచ్ఛకు ఎలాంటి ఆటంకం కలగకూడదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా, హర్మూజ్ జలసంధి వంటి కీలకమైన షిప్పింగ్ మార్గాలు ఎల్లప్పుడూ తెరిచి ఉండి, సురక్షితంగా ఉండాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. ఇరాన్‌లో నివసిస్తున్న భారతీయ పౌరుల భద్రత, సంక్షేమానికి ఇరాన్ ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి ప్రధాని మోదీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో తమ పౌరుల భద్రతకు భారత్ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్న సందేశాన్ని ఇది పరోక్షంగా తెలియజేసింది. పశ్చిమాసియాలో శాంతి, సుస్థిరతలను నెలకొల్పేందుకు భారత్ చేస్తున్న దౌత్య ప్రయత్నాల్లో ఇదొక ముఖ్యమైన ముందడుగుగా విశ్లేషకులు భావిస్తున్నారు. వివాదాల పరిష్కారానికి చర్చలే సరైన మార్గమని భారత్ మరోసారి తన వైఖరిని స్పష్టం చేసినట్లయింది. ఇదిలా ఉండగా, మార్చి 12న జరిగిన తొలి ఫోన్ సంభాషణలో కూడా ప్రధాని మోదీ పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, పౌరుల మరణాలు, మౌలిక సదుపాయాల విధ్వంసంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని సమస్యలను చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలన్నది భారత్ స్థిరమైన వైఖరి అని ఆయన స్పష్టం చేశారు. సరుకు రవాణా, ఇంధన సరఫరాకు ఆటంకాలు ఏర్పడితే భారత ఆర్థిక వ్యవస్థపై, ప్రాంతీయ స్థిరత్వంపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు.

## ‘స్కిల్స్’ పరిధిలోకి ఏటీసీలు, పాలిటెక్నిక్‌లు

హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా నెలకొల్పిన నైపుణ్య విశ్వవిద్యాలయ పరిధిని విస్తరించి దాన్ని బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆ వర్సిటీ పరిధిలోకి పాలిటెక్నిక్ కళాశాలలతో పాటు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీలు గతంలో ఐటీఐలు)ను తీసుకువస్తాయని తాజాగా ప్రభుత్వం ప్రకటించింది. అంతేకాదు ఇప్పటివరకు స్కిల్స్ వర్సిటీ ఐటీ, పరిశ్రమలశాఖ పరిధిలో కొనసాగుతుండగా.. ఇక నుంచి దాన్ని ఉన్నత విద్యాశాఖ కిందకు తీసుకురానున్నారు. ఈ విశ్వవిద్యాలయాన్ని 2024 ఆగస్టులో నెలకొల్పారు. రాష్ట్ర చట్టం ద్వారా పీపీపీ విధానంలో దీన్ని ఏర్పాటుచేశారు. దీనికి ఛాన్సలర్‌గా ముఖ్యమంత్రి వ్యవహరిస్తారు. బోర్డు ఆఫ్ గవర్నర్స్ ఛైర్మన్‌గా మహీంద్రా గ్రూపు ఛైర్మన్ ఆనంద్ మహీంద్ర కొనసాగుతున్నారు. తాత్కాలికంగా గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో నడుస్తుండగా.. ఫ్యూచర్ సిటీలో సుమారు 58 ఎకరాల్లో శాశ్వత ప్రాంగణం నిర్మాణమవుతోంది.

*** వర్సిటీ పరిధిలోకి కళాశాలలు ఎందుకంటే?**

ఒకనాటి పరిస్థితులు ఇప్పుడు లేవు. నైపుణ్యం కీలకంగా మారింది. అందుకే రాష్ట్ర సర్కారు స్కిల్స్ వర్సిటీని నెలకొల్పింది. దీనిద్వారా వందల మందికి మాత్రమే నైపుణ్యాలు అందించగలుగుతారు. భారీ సంఖ్యలో యువతకు స్కిల్స్ అందించాలంటే మళ్లీ అటు విద్యాశాఖ.. సాంకేతిక విద్యాశాఖ.. కార్మికశాఖ పరిధిలో ఉన్న కళాశాలలపై ఆధారపడాల్సిందే. అందుకే పాలిటెక్నిక్‌లు, ఐటీఐలతో పాటు టామ్‌కామ్‌ను నైపుణ్య వర్సిటీ పరిధిలోకి తీసుకువస్తాయని ప్రభుత్వం ప్రకటించింది. ఇటీవల తెలంగాణ విద్యాకమిషన్ ప్రభుత్వానికి అందజేసిన తెలంగాణ విద్యావిధానం 2026 సిఫార్సుల్లో కూడా పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలతో పాటు ఇంటర్ విద్యాశాఖ పరిధిలోని ఒకేషనల్ కోర్సులను స్కిల్స్ వర్సిటీ కిందకు తీసుకురావాలని సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ నిర్ణయంతో స్కిల్స్ వర్సిటీ తాను ఆశించిన లక్ష్యాల కోసం పనిచేసేందుకు.. యువతలో నైపుణ్యాలు పెంచేందుకు వీలవుతుందని భావిస్తున్నారు. అయితే స్కిల్స్ వర్సిటీ పరిధిలోకి అధికారికంగా తీసుకొచ్చేందుకు కనీసం సంవత్సరం పట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు.

**మూడు విభాగాల గురించి క్లుప్తంగా..**

పాలిటెక్నిక్ విద్య: రాష్ట్రంలో 57 ప్రభుత్వ, 56 ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. వాటికి అనుబంధ గుర్తింపు ఇవ్వడం, పరీక్షల నిర్వహణ, సిలబస్ రూపకల్పన కోసం రాష్ట్ర సాంకేతికవిద్య, శిక్షణామండలి (ఎస్‌బీటెట్) ఎన్నో ఏళ్ల క్రితమే ఏర్పాటు చేశారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఇక ఈ బోర్డు రద్దవుతుంది.

*** ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఐటీఐ)లు:**

ఇప్పటివరకు ఐటీఐలు కార్మికశాఖ పరిధిలో పనిచేస్తున్నాయి. ప్రభుత్వ ఐటీఐలు 63 వరకు ఉండగా.. గత ఏడాది అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీ)గా ఉన్నతీకరించారు. దానికితోడు మరో 219 ప్రైవేట్ ఐటీఐలున్నాయి. వాటిని స్కిల్స్ వర్సిటీ కిందకు తీసుకొస్తారు. విదేశాల్లో ఉద్యోగాల కల్పన కోసం తెలంగాణ ఓవర్‌సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్)ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇది కూడా ప్రస్తుతం కార్మికశాఖ పరిధిలోనే ఉంది.

## ఇరాన్‌పై దాడులు మరింత తీవ్రం చేస్తాం

**: ఇజ్రాయెల్ రక్షణ మంత్రి**

ఇరాన్‌పై వచ్చేవారం దాడులు మరింత తీవ్రతరం చేస్తామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ హెచ్చరించారు. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త వైమానిక దాడులు ఉద్ధృతం చేస్తామని కాట్జ్ తెలిపినట్లుగా ఇజ్రాయెల్ పత్రిక ఒకటి తెలిపింది. ఇరాన్ పాలకులు, ఆ దేశానికి ఆదాయవనరుగా ఉన్న మౌలిక సదుపాయాలపై తమ రెండు దేశాలు జరిపే దాడులు మరింత పెరుగుతాయని అన్నారు. ఈ యుద్ధం లక్ష్యాలను సాధించేవరకు ఆపేది లేదని కాట్జ్ స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ భద్రతకు, అమెరికా ప్రయోజనాలకు పొంచి ఉన్న ముప్పు తొలగిపోయే వరకు ఆ దేశ పాలనా యంత్రాంగం, కమాండర్లు, వ్యూహాత్మక సామర్థ్యాలను లక్ష్యంగా చేసుకుంటామని స్పష్టం చేశారు. ఇరాన్‌పై క్రమంగా సైనిక చర్యను తగ్గించే విషయాన్ని పరిశీలిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన గంటల వ్యవధిలో ఇజ్రాయెల్ మంత్రి నుంచి ఈ ప్రకటన రావడం గమనార్హం. ఇరాన్ నుంచి అణుముప్పును తొలగించడం, దాని సైనిక సామర్థ్యాలను దెబ్బతీయడం, ఆ దేశ ప్రజలకు స్వేచ్ఛను కల్పించడమే తమ ముందున్న లక్ష్యాలని అంతకుముందు ఇజ్రాయెల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహూ అన్నారు.

## అమరావతికి ‘క్వాంటమ్’ కళ

అమరావతి: రాజధాని అమరావతిని దేశంలోనే మొదటి క్వాంటమ్ టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. ఈ ఏడాది నవంబరు లేదా డిసెంబరు నాటికి ప్రపంచంలోనే అత్యాధునిక, అత్యంత వేగవంతమైన క్వాంటమ్ కంప్యూటర్‌ని అమరావతిలో ఏర్పాటు చేయబోతున్నారు. కేవలం క్వాంటమ్ కంప్యూటర్లను ఏర్పాటు చేయడమే కాకుండా, అమరావతిలోనే క్వాంటమ్ కంప్యూటర్లను తయారు చేసి... విదేశాలకు ఎగుమతి చేయాలన్న లక్ష్యంతో అమరావతి క్వాంటమ్ వ్యాలీ మిషన్ పనిచేస్తోంది. క్వాంటమ్ కంప్యూటింగ్‌తో పాటు, క్వాంటమ్ సెక్యూరిటీ, సెన్సింగ్, మెటీరియల్ రంగాలకు సంబంధించిన అన్ని టెక్నాలజీలకు అమరావతి క్వాంటమ్ వ్యాలీని హబ్‌గా మార్చాలన్నది యోచన. ఈ నాలుగు రంగాలకు సంబంధించిన స్టార్టప్, భాగస్వామ్య కంపెనీలను అమరావతికి ఆహ్వానిస్తున్నారు. ఇప్పటికే ఐదు స్టార్టప్‌లు కార్యకలాపాలు ప్రారంభించాయి. వచ్చే రెండు నెలల్లో మరో 2025 స్టార్టప్ కంపెనీలు ఇక్కడికి వచ్చే అవకాశం ఉంది. వాటికి ప్రస్తుతానికి గన్నవరంలోని మేధాటవర్స్‌లో చోటు కల్పిస్తున్నారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీకి ప్రభుత్వం 50 ఎకరాలు కేటాయించింది. దానిలో రెండు ఎకరాల్లో రూ.137 కోట్లతో నిర్మిస్తున్న అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ (ఏక్యూసీసీ) పనులు చురుగ్గా జరుగుతున్నాయి. జీ+1 విధానంలో, 40 వేల చ.అడుగులు నిర్మితప్రాంతంతో దీన్ని కడుతున్నారు. వచ్చే సెప్టెంబరు లేదా అక్టోబరు నాటికి నిర్మాణం పూర్తి చేయాలన్నది లక్ష్యం. ఏక్యూసీసీ భవనం అనేక విశేషాల సమాహారం. క్వాంటమ్ కంప్యూటర్‌కు అత్యంత స్థిరమైన వాతావరణం ఉండాలి. వాహనాలు వెళ్లేటప్పుడు ఏర్పడే వైబ్రేషన్ల ఫ్రీక్వెన్సీ గరిష్ఠంగా 7080 హెర్ట్జ్ ఉంటుంది. క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు చేసిన ప్రాంతంలో ఆ స్థాయి వైబ్రేషన్లు కూడా ఉండటానికి వీల్లేదు. 2100 హెర్ట్జ్ ఫ్రీక్వెన్సీ వైబ్రేషన్లు ఉన్నా... క్వాంటమ్ కంప్యూటర్‌పై ప్రభావంపడని విధంగా ఏక్యూసీసీ భవనాన్ని నిర్మిస్తున్నారు. దీని కోసం వైబ్రేషన్ ఐసొలేటర్లను జర్మనీ నుంచి తెప్పిస్తున్నారు. క్వాంటమ్ కంప్యూటర్ లోపల మాత్రం 273 డిగ్రీల ఉష్ణోగ్రత నిర్వహించాలి. ఇది అంతరిక్షంలో కంటే తక్కువ ఉష్ణోగ్రత. అంత తక్కువ ఉష్ణోగ్రతను నిర్వహించేందుకు డైల్యూషన్ రిఫ్రిజరేటర్లను వాడతారు. ఈ భవన నిర్మాణం పూర్తయ్యాక దానిలో ఐబీఎం సంస్థ క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు చేస్తుంది. కొన్ని ముఖ్యమైన స్టార్టప్‌లకు కూడా ఈ భవనంలో చోటు కల్పిస్తారు.

**రెండు టవర్లకు త్వరలో టెండర్లు**

అమరావతి క్వాంటమ్ వ్యాలీలో ఏక్యూసీసీ భవనంతో పాటు..44 అంతస్తుల టవర్లు ఎనిమిది నిర్మించాలన్నది ప్రతిపాదన. వాటిలో రెండు టవర్లను సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ప్రభుత్వమే నిర్మించనుంది. మొత్తం 8 టవర్లలో కలిపి 90 లక్షల చదరపు అడుగుల నిర్మిత ప్రాంతం అందుబాటులోకి తేవాలని, మొత్తం 88 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏక్యూసీసీ భవనంలో ఐబీఎం సంస్థ ప్రపంచంలోనే అత్యాధునిక, అత్యంత వేగవంతమైన ప్రాసెసర్‌తో కూడిన క్వాంటమ్ కంప్యూటర్‌ని ఏర్పాటు చేయనుంది. 156 క్యూబిట్స్ క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటుకు ఐబీఎం సంస్థతో మొదట ఒప్పందం జరిగింది. భవన నిర్మాణం అనుకున్న సమయానికంటే ఆలస్యమవడంతో, ఈ ఏడాది కాలంలో ఐబీఎం మరింత అత్యాధునిక క్వాంటమ్ ప్రాసెసర్‌ను తయారు చేసింది. ‘క్యూబిట్ లోపల ఒక ఆర్కిటెక్చర్ ఉంటుంది. ఎన్ని బిట్స్ ఒకదానికి ఒకటి కనెక్ట్ అవుతాయన్నదాన్నిబట్టి ప్రాసెసర్ వేగం ఆధారపడి ఉంటుంది. ఐబీఎం ఇప్పుడు తయారు చేస్తున్న 120 క్యూబిట్స్ ప్రాసెసర్‌లో... ఎక్కువ క్యూబిట్స్ కనెక్ట్ చేస్తున్నారు. అది అత్యంత అధునాతనమైంది. అమరావతిలో దాన్నే ఏర్పాటు చేస్తామని చెబుతున్నారు’ అని అమరావతి క్వాంటమ్ వ్యాలీ మిషన్ డైరెక్టర్ సి.వి.శ్రీధర్ ‘ఈనాడు’కి తెలిపారు. ఎస్ఆర్ఎం, మేధాటవర్స్‌లో

**చిన్న క్వాంటమ్ కంప్యూటర్లు**

గన్నవరంలోని మేధాటవర్స్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీల్లో క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీలను ఏర్పాటు చేయనున్నారు. మేధాటవర్‌లో ఏప్రిల్ 14న ప్రారంభిస్తారు. రిఫరెన్స్ ఫెసిలిటీలో చిన్నస్థాయి క్వాంటమ్ కంప్యూటర్లు ఉంటాయి. వాటిని క్వాంటమ్ కంప్యూటర్ విడిభాగాల (కాంపొనెంట్స్) టెస్టింగ్, హార్డ్‌వేర్‌లో శిక్షణ కోసం వినియోగిస్తారు. మేధాటవర్స్ మొదటి అంతస్తులో క్యూబిటెక్ సంస్థ రిఫరెన్స్ ఫెసిలిటీ ఏర్పాటు చేస్తుండగా, ఎస్ఆర్ఎం సంస్థ సొంతగా నెలకొల్పుతోంది. మేధాటవర్స్‌లోని మూడు, నాలుగు అంతస్తుల్లో ప్రస్తుతానికి క్వాంటమ్ వ్యాలీ మిషన్ కార్యాలయంతో పాటు, స్టార్టప్ కంపెనీలను ఏర్పాటు చేయనున్నారు. తర క్వాంటమ్ టెక్నాలజీ సంస్థలతోను సంప్రదింపులు అమరావతిలో ఐబీఎం ఏర్పాటు చేయనున్న క్వాంటమ్ కంప్యూటర్ సూపర్ కండక్టింగ్ టెక్నాలజీతో పనిచేస్తుంది.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేశ్..
### పేద ముస్లిం కుటుంబానికి కొత్త ఇల్లు

మంగళగిరిలో ఓ పేద ముస్లిం కుటుంబానికి ఇచ్చిన మాటను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిలబెట్టుకున్నారు. గతేడాది పవిత్ర రంజాన్ మాసంలో చేసిన వాగ్దానాన్ని ఏడాది తిరగకముందే నెరవేర్చి, వారికి కొత్త ఇంటిని నిర్మించి ఇచ్చారు. వివరాల్లోకి వెళితే... గతేడాది రంజాన్ మాసం సందర్భంగా మంత్రి లోకేశ్ మంగళగిరి బస్టాండ్ సమీపంలో నివసించే షేక్ షహెన్షా నివాసానికి ఆకస్మికంగా వెళ్లారు. అక్కడ షహెన్షా కుటుంబ సభ్యులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారి శిథిలావస్థలో ఉన్న రేకుల ఇంటిని మంత్రి పరిశీలించారు. తమ పూర్వీకులు నిర్మించిన ఆ ఇంటి స్థానంలో కొత్త ఇల్లు కట్టించి ఆదుకోవాలని షహెన్షా కుటుంబ సభ్యులు మంత్రిని కోరారు. వారి అభ్యర్థనకు స్పందించిన లోకేశ్, ఆ కుటుంబ బాధ్యతను తాను తీసుకుంటానని, కొత్త ఇల్లు నిర్మించి ఇస్తానని అక్కడికక్కడే హామీ ఇచ్చారు.

# ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి ) : రంజాన్ పర్వదినం సందర్భంగా కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్నగర్ డివిజన్ పరిధిలోని సుభాష్నగర్ లో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ జి.సురేష్ రెడ్డి పాల్గొని ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం ఒక్కరినొక్కరు అలాయ్ బలాయ్ తీసుకుని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ రంజాన్ నెల కేవలం ఉపవాసం ఉండటమే కాకుండా, స్వీయ నియంత్రణ, క్రమశిక్షణ, దానధర్మాలు (జకాత్) ,మానవాళికి సన్మార్గం చూపే పవిత్ర ఖురాన్ అవతరించిన మాసం అని అన్నారు. నెల రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పాటించే ఈ ఉపవాస దీక్షలు వ్యక్తిగత ఆధ్యాత్మిక ఉన్నతికి, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం పెరగడానికి దోహదపడతాయి అన్నారు.

# తెలంగాణ బడ్జెట్ లో గల్ఫ్ కార్మికులకు తీరని అన్యాయం



ప్రజాస్ఫూర్తి/ జన్నారం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ఎటువంటి నిధులను కేటాయించకపోవడం తీవ్ర నిరాశ కలిగించిందనీ తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర, జిల్లాల , మండలాల, శాఖ కార్యవర్గాలు, వ్యవస్థాపక అధ్యక్షులు కల్లెడ భూమయ్య, జన్నారం మండల అధ్యక్షులు మగ్గిడి తిరుపతి ఆవేదన వ్యక్తం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రభుత్వం తన మేనిఫెస్టోలో గల్ఫ్ కార్మికుల సంక్షేమం నిధితోపాటు గల్ఫ్ బోర్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పుడు ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరం అన్నారు. గల్ఫ్ దేశాల్లో కష్టపడి సంపాదిస్తూ తమ కుటుంబాలను పోషిస్తున్న వేలాది మంది గల్ఫ్ కార్మికులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. వారి సంక్షేమం కోసం ప్రత్యేక గల్ఫ్ బోర్డును ఏర్పాటు చేసి, అవసరమైన నిధులను కేటాయించాలని కానీ, తాజా బడ్జెట్‌లో దీనికి ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వకపోవడం దురదృష్టకరం అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రెండేళ్ల క్రితం హైదరాబాదులో గల్ఫ్ సంఘాల నేతలతో సమావేశపరిచి త్వరలో మీకు పాలసీ తో కూడిన గల్ఫ్ బోర్డ్ ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చారని గుర్తు చేశారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం పోరాడే అన్ని సంఘాలను కలుపుకుని మేము పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతామని స్పష్టం చేశారు.

# రంజాన్ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎంఎల్ఏ మెతుకు ఆనంద్



వికారాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి : వికారాబాద్ పట్టణం ఆలంపల్లి దర్గా వద్ద నిర్వహించిన సామూహిక ప్రార్ధనలో బి ఆర్ ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులను కలిసి, ఆత్మీయ ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పుల్మద్ది గ్రామంలోని మండల పార్టీ మైనారిటీ విభాగం అధ్యక్షులు గయాజ్ ఇంటికి వెళ్లిన ఆయన గ్రామంలో నూతనంగా పార్టీ తరుపున గెలిచిన పార్టీ వార్డు సభ్యులను సన్మానించారు.

# వన్యప్రాణి సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ అటవీ దినోత్సవవేడుకలు




మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ గూడూరు వన్యప్రాణి సంరక్షణ విభాగం డివిజన్ పరిధిలోని పలు రేంజ్‌లలో అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని నిర్వహించారు. అడవులు, ఆర్థిక వ్యవస్థలు అనే ప్రపంచ థీమ్‌కు అనుగుణంగా ఈ వేడుకను శనివారం జరిపారు.ఈ సందర్భంగా చేపట్టిన కార్యక్రమాలలో ప్రజల్లో అవగాహన ర్యాలీలు, పాఠశాలల్లో విద్యా ప్రచారం, పర్యావరణ సున్నిత ప్రాంతాలలో పర్యావరణ పరిశుభ్రత కార్యక్రమాలు, వేట నిరోధక అమలు కార్యకలాపాలు చేపట్టారు. మహబూబాబాద్, గూడూరు, బయ్యారం రేంజ్‌ల అటవీ శాఖ సిబ్బంది తమ తమ అధికార పరిధిలో ప్రజా అవగాహన ర్యాలీలను నిర్వహించారు. సిబ్బంది యూనిఫాంలో సమావేశమై, 'అంతర్జాతీయ అటవీ దినోత్సవం 2026' అనే నినాదాన్ని కలిగి ఉన్న బ్యానర్లను ప్రదర్శిస్తూ పట్టణ ప్రాంతాల గుండా కవాతు చేశారు. ఈ సందర్భంగా అడవుల పర్యావరణ, ఆర్థిక ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేశారు.

# మహిళలు అన్ని రంగాలలో ముందుకెళ్లాలి

* **మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి.**
* **ప్రజా ప్రతినిధులకు సన్మానం**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : మహిళలు అన్ని రంగాలలో ముందుకెళ్లాలని పురుషులతో సమానంగా ఎదగాలని నల్లగొండ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం స్థానికంగా జరిగిన ఐవీఎఫ్ మహిళా దినోత్సవం ప్రజాప్రతినిధులకు సన్మాన ఉత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా వ్యాపార పరంగా ఎదగాలన్నారు. మహిళలకు ఓర్పు సహనం ఎక్కువ అని కుటుంబ బాధ్యతలతో పాటు ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వహించి కుటుంబాన్ని అభివృద్ధిలోకి తీసుకువస్తుందన్నారు. మహిళలు నేడు అన్ని రంగాలలో రాణిస్తున్నారని మహిళలను గౌరవించడం వారిని సన్మానించడం మంచి సంప్రదాయమన్నారు. మహిళలు లేని సమాజం లేదని మహిళలు గౌరవించినచోట శుభాలు కలుగుతాయి అన్నారు. ఐ వి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీను మాట్లాడుతూ ఐవీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామని ఎంబిబిఎస్ ఐఏఎస్ ఐపీఎస్ చదువుకునే ఆర్యవైశ్య పేద విద్యార్థులకు లక్ష రూపాయలు చొప్పున సాయం అందించామని చెప్పారు. ఐ వి ఎఫ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలను నూతన ఆర్యవైశ్య ప్రజాప్రతినిధులను సన్మానించి వారిని గౌరవించడం ఐ వి ఎఫ్ సంప్రదాయమన్నారు. సభ్యత్వ సేకరణ ముమ్మరంగా సాగుతుందని ఐ వి ఎఫ్ బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామన్నారు దేశవ్యాప్తంగా 16 కోట్ల మంది ఆర్యవైశ్యులు ఉన్నారని అందులో నాలుగు కోట్ల మందికి ఐవీఎఫ్ సభ్యత్వం ఇవ్వనున్నామన్నారు ఆర్యవైశ్య పేద ప్రజల కోసం పనిచేస్తున్నామన్నారు. ఐ వి ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాల భద్రాద్రి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐ వి ఎఫ్ రాష్ట్ర మీడియా కమిటీ చైర్మన్ కోటగిరి దైవాధ్యానం నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐ వి ఎఫ్ జిల్లా మహిళా అధ్యక్షురాలు కొమిరిశెట్టి రమ చిట్యాల మున్సిపల్ చైర్మన్ పందిరి గీత, నల్లగొండ 48 వ వార్డు డివిజన్ కార్పొరేటర్ రామ కవిత దయాకర్ ఐ వి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటకం శ్రీనివాసు, సౌత్ సెంట్రల్ ఇన్చార్జి ఉప్పల స్వప్న చందా భాగ్య లక్ష్మి ఐవీఎఫ్ స్టేట్ ప్రెసిడెంట్ లెంకలపల్లి మంజుల కోశాధికారి నలిని ఐ వి ఎఫ్ నాయకులు తాళ్లపల్లి రాము, పారేపల్లి శ్రీనివాస్, నాల వెంకటేశ్వర్లు బుక్కా వెంకయ్య, మేడం విశ్వప్రసాద్ వందనపు జ్యోతి, వీరెల్లి సతీష్ కోటగిరి రామకృష్ణ కర్నాటి నగేష్ డాక్టర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం.ప్రతాప్ కి రంజాన్ పండుగ శుభాకాంక్షలు



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : రంజాన్ పండుగ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని దత్తాత్రేయ నగర్ లో గల నూరే మహమ్మదీయ మసీద్ కమిటీ సభ్యులు శనివారం రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం.ప్రతాప్ ని తన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కుత్బుల్లా పూర్ నియోజక వర్గం మైనార్టీ సెల్ చైర్మన్ జలీల్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ బాబు మియా, కుతుబ్షాహీ మసీద్ అధ్యక్షులు మొహమ్మద్ రషీద్, మహ్మద్ రియాజ్, మహమ్మద్ లియాకత్ అలి తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ముస్లిం సోదర, సోదరీమణులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దత్తాత్రేయనగర్ , ఎంఎన్ రెడ్డి నగర్, నూర్ ఇ మొహమ్మదీయా మస్జీద్ కమిటీ సభ్యులు జుబేర్, ఇస్మాయిల్, ఉస్మాన్, హుస్సేన్, ఇబ్రహీం, సయ్యద్, అక్బర్, అజీమ్, మన్సూర్ ,అక్రమ్ ,హాజీ జి , నదీమ్ , జాబిర్, వీరస్వామినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు గార శ్రీనివాస్, శ్రీ రామాంజనేయ యువజన సంఘం కోశాధికారి బూడిద రఘురాముల గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మతసామరస్యానికి ప్రతీక రంజాన్

* **మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి,**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : మత కలహాలు లేకుండా సోదరభావంతో, ఐక్యతతో రంజాన్ పండుగను జరుపుకోవాలని రాష్ట్ర రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని శనివారం ఆయన నల్గొండ పట్టణంలోని మునుగోడు రోడ్డులో ఉన్న ఈద్గా వద్ద ముస్లిం సోదరులతోకలిసి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా గత 30 రోజుల పాటు ముస్లింలు కఠోర దీక్షలు, ప్రార్థనలు చేశారని ,క్రమశిక్షణ,దాతృత్వం, ధార్మిక చింతన కలయిక పవిత్ర రంజాన్ పర్వదినం అని అన్నారు. అల్లా వారందరి జీవితాలలో వెలుగులు నింపాలని మంత్రి ఆకాంక్షించారు.అల్లా ఆశీర్వాదంతో సుఖ సంతోషాలతో జీవించాలని అన్నారు.ముస్లిం సోదరులంతా రంజాన్ పండుగను కుటుంబ సభ్యులందరితో కలిసి భక్తిశ్రద్ధలతో ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని తెలిపారు.నల్గొండ పట్టణంలోగత 30 సంవత్సరాలుగా హిందు , ముస్లింలు ఎలాంటి మత కలహాలు లేకుండా పండుగలు శాంతియుతంగా జరుపుకుంటున్నారని మంత్రి తెలిపారు.ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నదని, ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో ముస్లింల సంక్షేమానికి రూ.3,500 కోట్లను కేటాయించినట్లు మంత్రి తెలిపారు. గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ముస్లింలకు విద్య, ఉద్యోగ రంగాలలో 4 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. రిజర్వేషన్ల వల్ల ముస్లింలు వివిధ రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నారని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై అశోక్ రెడ్డి ,ఏ ఎస్ పి రమేష్. జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఆఫీజ్ ఖాన్,తహసిల్దార్ పరుశురాములు, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి. శరత్ చంద్ర మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్ , మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి ,మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి ,స్థానిక కార్పొరేటర్ మామిడి కార్తీక్, సుభాష్, నవీన్ ,అధికారులు, మైనార్టీ నాయకులు ,ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# నర్మెట్ట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీలో రైతు మేళా


* **రైతులతో కలిసి స్టాళ్లను పరిశీలించిన వంగ రాజేశ్వర్ రెడ్డి**



సిద్దిపేట జిల్లా, ప్రజాస్ఫూర్తి : నంగునూరు మండలం నర్మెట్ట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీలో రైతు మేళా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి నాయకులు వంగ రాజేశ్వర్ రెడ్డి హాజరై రైతులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రైవేట్ సంస్థలు ఏర్పాటు చేసిన స్టాళ్లను వంగ రాజేశ్వర్ రెడ్డి తమ టీం సభ్యులతో కలిసి సందర్శించారు. రైతులకు అందుబాటులో ఉన్న ఆధునిక వ్యవసాయ పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం, పంటల పెంపకం విధానాలపై వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డి గారు మాట్లాడుతూ, నర్మెట్ట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీలో నిర్వహిస్తున్న రైతు మేళా ఎంతో ప్రయోజనకరమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు రైతులకు నూతన సాంకేతికతను చేరువ చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఆధునిక వ్యవసాయ పరికరాలు, కొత్త పంటల నమూనాలు, లైవ్ స్టాక్ ప్రదర్శనలు రైతులకు ప్రత్యక్షంగా అవగాహన కల్పిస్తున్నాయని, ఇది వ్యవసాయ రంగ అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. ప్రభుత్వ శాఖలు, వ్యవసాయ నిపుణులు రైతులకు సమగ్ర సమాచారం అందించడం అభినందనీయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్టాళ్లను ఆసక్తిగా పరిశీలిస్తూ, తమకు అవసరమైన సమాచారాన్ని సేకరించారు.

# పేద ప్రజల పాలిట వరం సీఎం రిలీఫ్ ఫండ్

* **ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్***



ప్రజాస్ఫూర్తి, షాద్ నగర్ : ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజల పాలిట వరమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం షాద్‌నగర్ పట్టణానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే తన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ముఖ్యంగా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డుకు సంబంధించిన లబ్ధిదారులకు కౌన్సిలర్ కళ్యాణ్ కార్ దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో ఈ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలను అన్ని విధాలుగా ఆదుకోవడమే లక్ష్యంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్, సీనియర్ నాయకులు గంగనామోని సత్తయ్య, దశరథ్, గంగనామోని సాయి, రవి, ఇతర నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు, ప్రెస్ క్లబ్ సభ్యులకు సన్మానం



ప్రజాస్ఫూర్తి/ జన్నారం : జన్నారం మండలం లోని వివిధ గ్రామాల నుంచి ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో గెలుపొందిన గౌడ కులస్తుల ప్రజాప్రతినిధులు, ప్రెస్ క్లబ్ బాధ్యులకు సన్మానం ఏర్పాటు చేశారు. శనివారం మార్కెట్ హాల్ లో పొనకల్ గ్రామ గౌడ సంఘం అధ్యక్షులు పోడేటి సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జన్నారం ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా ఎన్నికైన గాజుల లింగన్న గౌడ్, ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన అమరగొండ సతీష్ గౌడ్ కు ఘనంగా సన్మానించారు. చింతలపల్లె సర్పంచ్ గా గెలుపొందిన పంజాల సురేష్ గౌడ్, కవ్వాల్ వార్డు సభ్యునిగా గెలుపొందిన పోడేటి మల్లేష్ గౌడ్, బాదం పెల్లి నుంచి వార్డు సభ్యులు నాయిని రమేష్ గౌడ్, చింతలపల్లి నుండి వార్డు సభ్యులు బుర్ర గడ్డ జగన్ గౌడ్, కలమడుగు వార్డు సభ్యులు నాయిని భూమా గౌడ్ ల ను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పొనకల్ గౌడ సంఘం అధ్యక్షులు పోడేటి సతీష్‌గౌడ్, జిల్లా నాయకులు బాలసాని శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షులు మూల భాస్కర్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు వోల్లాల నర్సాగౌడ్, గౌడ సంఘం నాయకులు పోలేటి నరేష్ గౌడ్, రాస మల్ల ప్రశాంత్ గౌడ్, గర్రెపల్లి శంకర్ గౌడ్, ఏనుగంటి సతీష్‌గౌడ్, అంజా గౌడ్, గొల్లపల్లి చంద్రమౌళి గౌడ్, వోల్లాల వెంకటేశ్వర్ గౌడ్, గొల్లపల్లి రమేష్ గౌడ్ వివిధ గ్రామాల నుంచి వచ్చిన గౌడ కులస్తులు పాల్గొన్నారు.

# మతసామరస్యానికి ప్రతీక రంజాన్



ప్రజాస్ఫూర్తి, షాద్ నగర్ : రంజాన్ పండుగ సందర్భంగా షాద్ నగర్ ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు శనివారం చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ , మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి లు ప్రార్థన లో పాల్గొన్నారు. ఇస్లాం మతంలో అత్యంత పవిత్రమైన ఈ రంజాన్ నెలలో ఉపవాసదీక్షలు, ప్రార్థనలు మనసును పవిత్రం చేసుకోవడానికి, మంచి మార్గంలో నడవడానికి, పరస్పర ప్రేమాభిమానాలను పెంపొందించడానికి ఒక మంచి అవకాశం అని వారు అన్నారు. పేదలకు దానం చేయడం ద్వారా సమాజంలో సమానత్వం పెరుగుతుందని ఆశభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సోదరులు మరియు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ ఈద్గా వద్ద మైనారిటీల ప్రార్థనలు



ప్రజాస్ఫూర్తి, షాద్ నగర్ : రంజాన్ మాసంతో సమాజంలో ఐక్యత,శాంతి పరస్పర గౌరవం పెరుగుతుందని ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు.షాద్ నగర్ పట్టణంలోని ఈద్గా వద్ద రంజాన్ సందర్భంగా మైనార్టీ సోదరులు చేసిన ప్రార్థనలలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం ఉపవాసం ద్వారా కేవలం ఆధ్యాత్మిక శుద్ధి మాత్రమే కాదని,పరస్పర గౌరవం,సహనం వంటి విలువలను కూడా నేర్పిస్తుందని అన్నారు. విభిన్న మతాలు ఉన్నా మనందరి లక్ష్యం శాంతి, మానవత,సౌభ్రాతృత్వమేనని ఐక్యతతో ఉంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. నాయకులు పిల్లి శేఖర్,రఘునాథ్ యాదవ్, గౌస్ జానీ,అడ్డు అజాజ్,సుధీర్,యాదగిరి,రవీందర్ రెడ్డి, భూపాల్ రెడ్డి,శేఖర్ పంతులు,యారం శేఖర్,పల్లె శ్రీనివాస్ రెడ్డి,సలీం, ప్రముఖ పాత్రికేయులు ఖాజపాషా, మైనారిటీ నేతలు పర్వేజ్,బిలాల్ యువ నాయకులు దినేష్ సాగర్,శివ చారి,అల్లాడ శేఖర్,అన్మరి రాజు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ లోనే సీఎం పిఆర్ సి ప్రకటన చేయాలి..

* **రిటైర్డ్ ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలు, పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి.**
* **పీఆర్ టీ యూ జిల్లా శాఖ అధ్యక్షుడు ఏ మాణయ్య**



అందోలు, ప్రజాస్ఫూర్తి : ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన వేతన సవరణను (పిఆర్ సి) ను జాప్యం చేయకుండా తక్షణమే ప్రకటించాలని పీఆర్ టీ యూ జిల్లా శాఖ అధ్యక్షుడు మాణయ్య ఒక ప్రకటనలో కోరారు. ఏళ్లు గడిచినా ఉద్యోగుల పిఆర్సీ పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం పట్ల తీవ్ర ఆందోళనకు గురిఅవుతున్నామని, శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో కూడా పిఆర్సీ అంశాలపై ఎలాంటి స్పష్టమైన ప్రకటన లేకపోవడంతో, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర నిరాశకు లోను కావడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం కూడా పిఆర్సీ విషయంలో ఆలస్యం చేస్తోందని పేర్కొన్నారు. పిఆర్సీ నివేదిక వెంటనే తెప్పించి సంఘాలతో చర్చించి, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 42శాతం ఫిట్ మెంట్ తో 2023 జూలై 1 నుండి అమలు చేయాలని పిఆర్ టియు సంఘ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డిఎలు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతుందని. కేవలం నెలవారీ వేతనాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు తప్ప మిగతా ప్రయోజనాలేవీ అందడంలేదన్నారు. 2024 మార్చి నుండి పదవీ విరమణ పొందిన ఉద్యోగుల బకాయిలు చెల్లించడం, పెండింగ్ బిల్లులు క్లియర్ చేయడం డీఏ బకాయిలు ఏ మాత్రం ఆలస్యం లేకుండా విడుదల చేయాలని కోరుతున్నట్లు తెలిపారు. ఇటీవల విద్యాకమీషన్ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో విద్యాశాఖ మెరుగుదలకు అనేక సిఫారసులు చేసిందని. మొత్తం రాష్ట్ర బడ్జెట్ రూ.3,24,234 కోట్లలో విద్యారంగానికి కేవలం 26,674 కోట్లు కేటాయింపుతో విద్యాశాఖకు 8.23శాతం మాత్రమే ఇవ్వడం వల్ల ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే ఇంటిగ్రేటెడ్ స్కూళ్ళకు, పబ్లిక్ స్కూల్ ల ఏర్పాటుకు నిధులు సమకూర్చడం కష్టతరమేనని అన్నారు. ఆరోగ్య కార్డు ద్వారా నగదు రహిత వైద్యం అందించే ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా బడ్జెట్లో ఉద్యోగుల ఆరోగ్య పథకానికి రూ.1056 కోట్ల కేటాయింపును పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయాన్ని పూర్తిగా స్వాగతిస్తున్నామన్నారు. రాష్ట్ర విద్యా విధానంలో వచ్చే విద్యాసంవత్సరం నుండి ప్రీ ప్రైమరీ టూ ప్లస్ టూ విధానాన్ని అమల్లోకి తెస్తున్నట్లు, టెన్త్ పరీక్షలు ఉండవని ముఖ్యమంత్రి ప్రకటించడంపట్ల గందరగోళ పరిస్థితి నెలకొందని నూతన జాతీయ విద్యావిధానాన్ని అన్వయించుకొనే ముందు మేధావుల, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి విస్తృత అభిప్రాయాల సేకరణ అనంతరం స్పష్టమైన సమగ్ర ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు వెళ్లాలని కోరుతున్నట్లు తెలిపారు.

## వృక్షారోపణకు పూర్వ కలెక్టర్ ఆర్థిక సాయం




ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: పాల్వంచ మండల పరిధిలోని శ్రీనివాస గుట్ట వద్ద వృక్షారోపణకు విశేషంగా కృషి చేస్తున్న పిట్టల వెంకన్నకు పూర్వ జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ స్వతహాగా రూ.10,000లు ఆర్థిక సహాయం అందించగా ఆ మొత్తాన్ని శనివారం భక్త సమాజ మండలి అధ్యక్షులు ఊకె భద్రయ్య, ఆరుట్ల లక్ష్మణాచారి సేవా ట్రస్టు సెక్రటరీ, భక్త సమాజ మండలి సహాయ కోశాధికారి ధనకోటి వెంకటేష్ పిట్టల వెంకన్నకు అందజేశారు. పాండురంగపురం గ్రామానికి చెందిన పిట్టల వెంకన్న పాల్వంచలోని శ్రీనివాస గుట్టపై భక్తులకు సేవగా అనేక వృక్షాలను నాటి సంరక్షిస్తున్నారు. గుట్టకు వచ్చే భక్తులకు మొక్కలు అందించేందుకు నర్సరీ ఏర్పాటు చేయాలని ఆయన సంకల్పించారు. ఈ నర్సరీ ఏర్పాటుకు అవసరమైన మొక్కల కొనుగోలు, పెంపకం, తోటపని పరికరాలు, కొమ్మల ద్వారా పెంచే మొక్కలు కోసం ప్రోత్సాహకంగా కలెక్టర్ ఈ సహాయాన్ని అందించారు.

## ఖమ్మం జిల్లాలో ఘనంగా రంజాన్ వేడుకలు



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం : జిల్లాలో ఘనంగా రంజాన్ వేడుకలు జరుపుకున్నారు. ముస్లింలకు రంజాన్ పండుగ ఎంతో ప్రవిత్రమైనది. రంజాన్ పండుగ సామరస్యానికి, సుహృద్భావనికి, సర్వమానవ సమానత్వానికి , కరుణకు , దాతృత్వానికి ప్రతీక . అల్లాహ్ దీవెనలతో జిల్లా ప్రజలకు ,రాష్ట్రా ప్రజలకు , ప్రపంచ మానవాళికి సకల శుభాలు కలగాలని. క్రమశిక్షణ,దాతృత్వం , ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం ప్రాముఖ్యత . పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో కఠిన ఉపవాస దీక్షలకు రంజాన్ ఒక ముగింపు వేడుక. మనిషిలోని చెడు భావనల్ని అధర్మాలని ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ రంజాన్.

## భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రజాస్ఫూర్తి: ముస్లిం సమాజానికి అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం సందర్భంగా బేతోలులో పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే మసీదులకు వెళ్లిన భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అల్లాహ్ కృపను కోరుకున్నారు. పండుగ సందర్భంగా చిన్నారుల నుంచి పెద్దల వరకు కొత్త దుస్తులు ధరించి ఆనందంగా కనిపించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఒకరికొకరు "ఈద్ ముబారక్" చెప్పుకుంటూ సంతోషాన్ని పంచుకున్నారు. ప్రతి ఇంటా ఆనంద వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా సేమియా, పాయసం వంటి ప్రత్యేక వంటకాలను సిద్ధం చేసి, బంధుమిత్రులకు పంచిపెట్టారు. సంప్రదాయ వంటకాలతో అతిథులను ఆతిథ్యపూర్వకంగా ఆహ్వానించి, స్నేహభావాన్ని మరింత బలపరిచారు.ఈ ప్రత్యేకమైన రోజునే తమ పెళ్లి రోజు కావడం మరింత ఆనందంగా ఉందని ఖాదర్ బాబా తెలిపారు. పండుగతో పాటు కుటుంబ వేడుక కలిసి రావడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

## ఎంఐఎంకి కార్పొరేషన్ ధారాదత్తం..

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శలు**



హైదరాబాద్ : మహానగర పాలక సంస్థను మూడు ముక్కలుగా విభజించడంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్‌రావు మండిపడ్డారు. జీహెచ్ఎంసీ పరిధిలోని బీజేపీ డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో క్షేత్రస్థాయిలో సంస్థాగత సమన్వయం, పార్టీ బలోపేతం, అలాగే కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లే వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లను విభజించిందని, ఇందులో ఒక కార్పొరేషన్‌ను పరోక్షంగా ఎంఐఎంకి ధారాదత్తం చేసిందని ఆయన రామచందర్‌రావు ధ్వజమెత్తారు. హైదరాబాద్ అందరికీ ప్రతిష్ఠాత్మక నగరమని, ప్రతి డివిజన్‌లో కృషి చేయడం, నగరాన్ని కాపాడుకోవడం ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా భావించాలని ఆయన శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందర్‌రావు, రాష్ట్ర ఇన్‌చార్జి అభయ్ పాటిల్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎమ్మెల్సీలు కొమురయ్య, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చౌలపల్లిలో ఘనంగా రంజాన్ విందు



ప్రజాస్ఫూర్తి ప్రతినిధి , షాద్నగర్ : పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని చౌలపల్లి గ్రామంలో భారీ విందు కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీపీ ఖాజా ఇద్రిస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ విందు అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పండుగ వేళ ముస్లిం సోదరులతో కలిసి వారు విందులో పాల్గొని, రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ రంజాన్ పండుగ శాంతికి, కరుణకు సోదరభావానికి ప్రతీక అని కొనియాడారు. అందరూ కలిసి మెలిసి పండుగలు జరుపుకోవడం వల్ల సమాజంలో ఐకమత్యం పెరుగుతుందని వారు పేర్కొన్నారు. ఇంతటి భారీ విందును ఏర్పాటు చేసిన ఖాజా ఇద్రిస్‌ను ఈ సందర్భంగా పలువురు అభినందించారు. అతిథులందరికీ ఖాజా ఇద్రిస్ సాదర స్వాగతం పలికి, మర్యాదలు గావించారు. ఈ విందు కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఐక్యమత్యానికి నిదర్శనం రంజాన్ మాసం

* **కాంగ్రెస్ సీనియర్ నేత ఎం.డి. ఇబ్రహీం**



ప్రజాస్ఫూర్తి ప్రతినిధి, షాద్నగర్ : పవిత్ర రంజాన్ మాసం ఐక్యమత్యానికి, సోదరభావానికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎం.డి. ఇబ్రహీం అన్నారు. శనివారం షాద్ నగర్ పట్టణంలోని ఆయన స్వగృహంలో రంజాన్ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విందు కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, ప్రముఖులు భారీగా హాజరయ్యారు. వారితో పాటు మున్సిపల్ చైర్మన్ బస్వం, వైస్ చైర్మన్ అందె మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, సీనియర్ నేతలు చెంది తిరుపతి రెడ్డి, రఘు, కౌన్సిలర్లు అప్పి, దిలీప్ తదితర నేతలు పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ షాద్ నగర్ నియోజకవర్గంలో అన్ని మతాల వారు సోదరభావంతో కలిసి మెలిసి పండుగలు జరుపుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు. ఇబ్రహీం నివాసంలో జరిగిన ఈ వేడుక గంగాజమునా తెహజీబ్‌ను ప్రతిబింబించిందని కొనియాడారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులందరికీ ఎం.డి. ఇబ్రహీం సాదర స్వాగతం పలికి, పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ వార్డుల కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నాయకులు మహబూబ్, మహమ్మద్ కాజ లైక్, ఇసాక్ కార్యకర్తలు, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సర్వమత సామరస్యాన్ని చాటిన రంజాన్ వేడుకలు

* **బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి**

ప్రజాస్ఫూర్తి ప్రతినిధి , షాద్నగర్ : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని షాద్ నగర్ పట్టణంలో జరిగిన పలు రంజాన్ వేడుకలలో బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి హాజరయ్యారు. పీర్లగూడలో నవాజ్ గోరి స్వగృహంలో, విట్యాలలో వాహబ్, ఇసాక్ స్వగృహంలో, షాద్ నగర్ పట్టణంలో శివ గార్డెన్‌లో కౌన్సిలర్లు మహమ్మద్ ఎజాజ్ (అడ్డు), సర్వర్ పాష సంయుక్తంగా ఏర్పాటు చేసిన రంజాన్ వేడుకలో పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా మైముద్ స్వగృహంలో నిర్వహించిన రంజాన్ వేడుకల్లో పాల్గొని సోదరభావాన్ని పంచుకున్నారు. రంజాన్ వేడుకలో పాల్గొని కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... రంజాన్ పండుగ మత సామరస్యానికి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి ముందుకు సాగితేనే సమాజంలో శాంతి, అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మోహన్ సింగ్, చిట్టెం లక్ష్మీకాంత్ రెడ్డి, కుడుముల బాల్ రాజ్, శ్యామ్ సుందర్ రెడ్డి, చెవుల బాస్కర్, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జోగిపేటలో ఘనంగా రంజాన్ వేడుకలు

* **ఈద్ ముబారక్ తెలిపిన ఛైర్మెన్, వైస్ చైర్మన్**



అందోలు, ప్రజాస్ఫూర్తి : జోగిపేట పట్టణంలో ముస్లీంల పవిత్ర పండగైన రంజాన్ పండగను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ముస్లీం సోదరులు ఉదయం 9 గంటల వరకు అందోలు, జోగిపేటలలోని ఈద్గాల వద్దకు నూతన వస్త్రాలను ధరించి వందల సంఖ్యలో చేరుకొని ప్రార్థనలు చేసారు. మతపెద్దలు వారిని ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం ఒకరికొకరు అలింగనం చేసుకొని ఈద్ ముబారక్ తెలియజేసుకున్నారు. ఈద్గాల వద్దకు ప్రజాప్రతినిధులు వెళ్లి వారికి పండగ శుభాకాంక్షలు తెలియజేసారు. మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఆకుల చిట్టిబాబు ముదిరాజ్, కౌన్సిలర్లు శ్రీనివాస్, శివశేఖర్, నాగరత్నంగౌడ్, రామకృష్ణ, అనీల్‌కుమార్, మాజీ కౌన్సిలర్ నాగరాజు, నాయకులు అనీల్, ప్రదీప్‌గౌడ్‌లతో పాటు పలువురు ముస్లీంలకు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని 15వ వార్డులోని ముస్లీం సోదరులకు వైస్ చైర్మన్ చిట్టిబాబు ముదిరాజ్ ఇంటింటికి పండగ సందర్భంగా పండగకు ఉపయోగపడే వస్తువులను అందజేసారు.

## పంట నష్టం పరిశీలించిన వ్యవసాయ శాఖ అధికారులు



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:జిల్లాలో కురిసిన అకాల వర్షాలు, వడగళ్ల వాన కారణంగా జరిగిన పంట నష్టాన్ని శనివారం వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాల్వంచ మండలం పాయకారి యానం బైలు , రాజాపురం గ్రామాల్లో మక్కజొన్న పంటను సందర్శించి నష్టం స్థాయిని అంచనా వేశారు. ప్రాథమికంగా 7 గ్రామాల్లో 190 మంది రైతులకు చెందిన సుమారు 265 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించినట్లు తెలిపారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ద్వారా సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ అధికారి బాబురావు తెలిపారు.

## పార్వతీ పరమేశ్వరుల ఆలయ చైర్మన్ కు సన్మానం



వికారాబాద్ జిల్లా, ప్రజస్ఫూర్తి : ఎల్లకొండ పార్వతీ పరమేశ్వర ఆలయ చైర్మన్‌గా ఎన్నికైన పట్లోళ్ల భరత్ రెడ్డి నవాబ్ పేట మండల నాయకులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భరత్ నేతృత్వంలో ఆలయం మరింత వైభవాన్ని సంతరించుకోవాలని, భక్తులకు మెరుగైన సేవాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గణపురం శాంతి కుమార్, బి సి సెల్ అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్, రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేశం, సోషల్ మీడియా కన్వీనర్ వినోద్, బి ఆర్ ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు ప్రకాష్, శేఖర్ హాజరై భరత్ రెడ్డిలు శుభాకాంక్షలు తెలిపారు.

## ఆరు గ్యారంటీల అమలు కోసం అసెంబ్లీలో బీఆర్ఎస్ ప్రైవేటు బిల్లు : కేటీఆర్

హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు కోసం బీఆర్ఎస్ పార్టీ ప్రైవేట్ మెంబర్ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టబోతున్నది. అడ్డుగోలుగా ఓటు వేయించుకొని రాష్ట్రంలోని అన్ని వర్గాలను మోసం చేసిన ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు బిల్లును ప్రవేశపెడుతున్నట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. తెలంగాణ భవన్‌లో పార్టీ లీగల్ సెల్ విభాగం, సీనియర్ నేతలతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన తొలిరోజే సీఎం ఆరు గ్యారెంటీల అమలు ఫైలుపై సంతకం చేశారన్నారు. సరిగ్గా వారం రోజుల తర్వాత అప్పటి రాష్ట్ర గవర్నర్‌తో అసెంబ్లీ ఉభయ సభల సమావేశంలో చెప్పించారన్నారు. 800 రోజులైనా 6 గ్యారంటీలో అమలులో అతిగతీలేదని ఆరోపించారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఈ బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాల్లోనే ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. స్పీకర్ కార్యాలయాన్ని మండలిలో చైర్మన్ కార్యాలయాన్ని కలిసి ఈ బిల్లును అనుమతించాలని కోరుతామని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీల అమలుపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లును సభలో అనుమతించాలని డిమాండ్ చేశారు. గతంలో ఎన్టీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రైవేటు మెంబర్ బిల్లును ప్రభుత్వం ఆమోదించి ప్రజలపై చిత్తశుద్ధిని చాటుకుందని, ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రభుత్వాలు ఆమోదించే సాంప్రదాయం ఇప్పటికే రాష్ట్రంలో ఉందని తెలిపారు. అందుకే ఈ ఆరు గ్యారెంటీల అమలు కోసం తెస్తున్న బిల్లును కాంగ్రెస్ పార్టీ ఆమోదించాలన్నారు. పాలక పక్షం, ప్రతిపక్షం రెండు కోరుతున్నాయి కాబట్టి ఈ బిల్లు ఆమోదం ఈజీగా జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని రైతులు, మహిళలు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, యువకులు ఇలా ప్రతి ఒక్క వర్గం తరఫున ఈ బిల్లును తాము ప్రతిపాదిస్తున్నామని చెప్పారు. ఈ బిల్లు చట్టం అయితే రైతన్నలకు రైతుబంధు ఎగ్గొట్టేందుకు ప్రభుత్వానికి వీలుండదన్నారు. సీఎం ఖచ్చితంగా రైతుబంధుతో సహా ఇచ్చిన అన్ని హామీలు అమలు చేయాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీలు అమలుకు ఈ చట్టం అత్యంత కీలకమని, ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లు చట్టమైతే ప్రభుత్వం మెడకు ఇది ఒక చట్రం లెక్క పనిచేస్తుందన్నారు. ప్రభుత్వ ఎగవేతలకు కళ్లెం వేస్తుందన్నారు. ప్రతి ఒక్క లబ్ధిదారుడికి ఖచ్చితంగా లబ్ధి చేకూరేలా వీలవుతుందన్నారు. ఈ చట్టంతో అన్నదాతలకు, ఆటో అన్నలకు, మహిళలకు, విద్యార్థులకు ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ బిల్లును ప్రవేశపెట్టిన తర్వాత అన్ని పార్టీల నేతలను కలుస్తామని, మద్దతు ఇవ్వాలని కోరుతామన్నారు. అవసరమైతే లేఖలు రాస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ఇలా అన్ని పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్క తెలంగాణ బిడ్డ ఈ బిల్లు అమలు కోసం స్థానిక ఎమ్మెల్యేలపై ఒత్తిడి చేయాలని కోరారు.

# ఆధునిక యుద్ధం..సరిహద్దులు దాటింది: రాజ్‌నాథ్ సింగ్

నేటి రోజుల్లో యుద్ధం అంటే కేవలం సరిహద్దుల్లో జరిగే ఘర్షణ మాత్రమే కాదని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ప్రస్తుతం యుద్ధం సరిహద్దులను దాటిందని.. ఆర్థిక, డిజిటల్, ఇంధన, ఆహార భద్రతలు కూడా జాతీయ భద్రతలో భాగమయ్యాయని అన్నారు. వాటి ద్వారా ఒక దేశం మరో దేశాన్ని బలహీనపరిచే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి ప్రతి పౌరుడు అన్నివేళలా దేశ రక్షణ కోసం సన్నద్ధమై ఉండాలని పిలుపునిచ్చారు. ఉత్తరాఖండ్‌లోని సైనిక పాఠశాల ఆవిర్భావ దినోత్సవంలో వర్చువల్‌గా పాల్గొన్న రాజ్‌నాథ్



మాట్లాడుతూ..ఈ వ్యాఖ్యలు చేశారు. ఆధునిక యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా దేశంలో ఆయుధ సంపత్తిని అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. అందులో భాగంగానే సాయుధ దళాలకు అధునాతన, స్వదేశీ ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దేశ రక్షణలో యువత కూడా తమ వంతు పాత్ర పోషించాలని రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. ఎటువంటి సమస్యనైనా ఎదుర్కోగలిగేలా క్రమశిక్షణ, మానసిక దృఢత్వం పెంపొందించుకోవాలన్నారు. సైన్యం, పౌరులు బలంగా ఉన్నప్పుడే దేశం ముందడుగు వేస్తుందన్నారు.

**ఎన్‌సీసీలో ప్రవేశాల సామర్థ్యం పెంపు**

దేశ రక్షణలో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ)లో ప్రవేశాల సామర్థ్యాన్ని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గతంలో 17 లక్షలుగా ఉన్న నియామకాలను 20 లక్షలకు పెంచుతున్నట్లు తెలిపారు. అంతే కాకుండా ప్రజా ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) నమూనాలో దేశవ్యాప్తంగా 100 కొత్త సైనిక పాఠశాలలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**'నారీ శక్తి'కి ఊతం**

సైనిక పాఠశాలల్లో బాలికలు ఎక్కువ సంఖ్యలో చేరుతుండడాన్ని చరిత్రాత్మకమైన ముందడుగు అని అభివర్ణించారు. ఈ నిర్ణయం దేశ 'నారీ శక్తి'ని మరింత బలోపేతం చేస్తోందన్నారు. బాలికా క్యాడెట్లు తమ సామర్థ్యాలను నిరంతరం నిరూపించుకుంటున్నారని, వివిధ రంగాలలో భవిష్యత్ నాయకులుగా ఎదుగుతారని ఆకాంక్షించారు.

## రాష్ట్రాలకు ఎల్పీజీ
# కేటాయింపు పెంపు : కేంద్రం

వాణిజ్య గ్యాస్ కొరతను అధిగమించేందుకు చర్యలు చేపట్టిన కేంద్రం.. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు వాణిజ్య ఎల్పీజీలో అదనంగా 20శాతం కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. తాజా చర్యతో సంక్షోభ కాలానికి ముందున్న కేటాయింపుల్లో 50శాతానికి చేరినట్లయ్యిందని పేర్కొంది. అయితే, వీటిలో హోటళ్లు, రెస్టరంట్లు, దాబాలు, పారిశ్రామిక క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కమ్యూనిటీ కిచెన్‌లు, సబ్సిడీల్లో ఆహారం అందించే కేంద్రాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం సూచించింది. చమురు



కంపెనీల వద్ద రిజిస్టరైన వాణిజ్య సంస్థలతోపాటు పీఎన్‌జీ (పైపు ద్వారా గ్యాస్ పంపిణీ) కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వాటికే ఈ అదనపు కేటాయింపు వర్తిస్తుందని కేంద్రం పేర్కొంది. మార్చి 23 నుంచి నుంచి ఈ అదనపు కేటాయింపులు సరఫరా చేస్తామని తెలిపింది. దీంతోపాటు వలస కూలీలకు ఐదు కిలోల గ్యాస్ సిలిండర్లు అందజేయాలని సూచించింది. సిలిండర్లు పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన నిఘా పెట్టాలని ఆదేశించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు పెట్రోలియంశాఖ కార్యదర్శి లేఖ రాశారు.

# సోషల్ మీడియాలో నిందితుల ఫొటోలు.. సుప్రీం ఆందోళన

మొబైల్ ఫోన్లలో చిత్రీకరించిన వీడియోలను ప్రజలు వెంటనే సోషల్ మీడియాలో షేర్ చేసే ధోరణిని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. అలాంటి చర్యలు పారదర్శక విచారణకు ముప్పుగా మారుతాయని ఆందోళన వ్యక్తంచేసింది. నిందితుల వీడియోలు, ఫొటోలను పోలీసులు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసి, ప్రజల ఆలోచనలను ప్రభావితం చేస్తున్నారని ఆరోపిస్తూ



సుప్రీంకోర్టులో ఒక వ్యాజ్యం దాఖలైంది. ఒక కేసు విషయంలో పోలీసుల మీడియా బ్రీఫింగ్‌పై మార్గదర్శకాలు రూపొందించాలని అత్యున్నత న్యాయస్థానం ఇప్పటికే రాష్ట్రాలను ఆదేశించింది. అందులో సోషల్ మీడియాను కూడా చేర్చాలని పిటిషన్ కోరారు. ఈ పిల్‌పై జరిగిన విచారణలో భాగంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సంకెళ్లు వేసిన, తాళ్లతో బంధించిన, మోకాళ్లపై కూర్చోబెట్టిన నిందితుల ఫొటోలను పోలీసులు సోషల్ మీడియాలో షేర్ చేయడం ఆ వ్యక్తి గౌరవానికి భంగం కలిగించడమే అవుతుందని, అది ప్రజల ఆలోచనను ప్రభావితం చేస్తుందని పేర్కొంది. "నిబంధనల ద్వారా పోలీసులను నియంత్రించడానికి వీలు ఉంటుంది. కానీ సోషల్ మీడియా, ప్రజల సంగతేంటి..? వారిని నియంత్రించగలమా..?" అని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ అంశంపై విస్తృత పరిశీలన అవసరం అని అభిప్రాయపడింది.

# రెండో ప్రపంచ యుద్ధం నాటి బాంబు.. ఆర్మీ సాయం కోరిన ఝార్ఖండ్


ఇసుక తవ్వకాల్లో భాగంగా ఓ బాంబు బయటపడటం ఝార్ఖండ్‌లో కలకలం రేపింది. దాన్ని రెండో ప్రపంచ యుద్ధం కాలం నాటి పేలుడు పదార్థంగా అనుమానిస్తున్నారు. ఆ బాంబును నిర్వీర్యం చేసేందుకు అవసరమైన నైపుణ్యం రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన 'బాంబ్ డిటెక్షన్ అండ్ డిస్పోజల్ స్క్వాడ్' వద్ద లేకపోవడంతో సైన్యం సాయాన్ని కోరినట్లు అధికారులు తెలిపారు. తూర్పు సింగ్‌భూమ్ జిల్లా బహరాగోడా ప్రాంతంలోని సువర్ణరేఖ నదీ తీరంలో ఇటీవల ఇసుక తవ్వకాలు చేపడుతుండగా.. ఓ పేలని బాంబు బయటపడింది. దీంతో వెంటనే పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆ ప్రాంతాన్ని



తమ అధీనంలో తీసుకున్నారు. ఆ వస్తువును సమీపించవద్దని, దానిని కదిలించవద్దని గ్రామస్థులను హెచ్చరించారు. గ్యాస్ సిలిండర్ మాదిరి ఉన్న ఆ బాంబు ఇంకా యాక్టివ్‌గా ఉందని భావిస్తున్నారు. దానిపై ఉన్న గుర్తుల ఆధారంగా.. అమెరికా తయారు చేసిన బాంబు అయి ఉండొచ్చని అంచనా వేశారు. అయితే, దానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియరాలేదు. "రాంచీకి చెందిన 'బాంబ్ డిటెక్షన్ అండ్ డిస్పోజల్ స్క్వాడ్'.. ఆ బాంబును పరిశీలించింది. అది క్రియాశీలకంగా, బరువుగా ఉందని గుర్తించింది. అయితే.. ఐఈడీలు, చిన్న తరహా పేలుడు పదార్థాల నిర్వహణ విషయంలోనే బీడీడీఎస్‌కు అవగాహన ఉంది. సాధారణ పద్ధతుల్లో దాన్ని నిర్వీర్యం చేయడం సాధ్యం కాదని గుర్తించింది. సైన్యం సాయం అవసరమని తెలిపింది. ఈ క్రమంలోనే సైన్యానికి చెందిన బాంబు డిస్పోజల్ యూనిట్ సాయం కోరుతూ లేఖ రాశాం" అని ఓ పోలీసు అధికారి తెలిపారు.

## 60శాతం సీట్లపై అదనపు ఛార్జీలు రద్దు..
# వ్యతిరేకించిన విమానయానసంస్థలు


అన్ని విమానాల్లో కనీసం 60 శాతం సీట్లపై ఎలాంటి అదనపు ఛార్జీలు విధించకుండా విమానయాన సంస్థలకు కేంద్రం ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. వీటిని దేశీయ విమానయాన సంస్థలు వ్యతిరేకించాయి. ఈ నిర్ణయంతో టికెట్ల ధరలను పెంచాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ మేరకు ఇండిగో, ఎయిరిండియా, స్పైస్‌జెట్‌లకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎయిర్‌లైన్స్ కేంద్ర పౌరవిమానయాన శాఖకు లేఖ రాసింది. ఈ ఆదేశాలు తమ కీలక ఆదాయ మార్గానికి గండి కొట్టే విధంగా ఉన్నాయని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ చర్యల వల్ల విమానయాన సంస్థలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని పేర్కొంది. తాము కోల్పోయిన ఆదాయాన్ని తిరిగి రాబట్టుకోవడానికి విమానయాన సంస్థలు ఛార్జీలు పెంచాల్సి వస్తుందని తెలిపింది. ప్రయాణికుల ప్రయోజనం కోసం తీసుకున్న నిర్ణయం చివరికి వారికే ప్రతికూలంగా మారే అవకాశం ఉందని వెల్లడించింది. తరచుగా విమానాల్లో ప్రయాణించేవారికి మరింత నష్టం కలిగిస్తుందని



పేర్కొంది. ధరల నిర్ణయం, సీట్ల కేటాయింపు అనేవి కీలకమైన వ్యాపార నిర్ణయాలని ఎఫ్ఐఏ పేర్కొంది. విమానయాన సంస్థలకు చెందిన వాణిజ్య అంశాలలో డీజీసీఏ వంటి నియంత్రణ సంస్థలు ఎలా జోక్యం చేసుకుంటాయని ప్రశ్నించింది. అన్‌బండిల్డ్ (ఛార్జీలు మినహా ఇతర సేవలు) సేవల కోసం ఛార్జీలను నిర్ణయించే అధికారం డీజీసీఏకు లేదని తెలిపింది. ఈ ప్రకటన చేయడానికి ముందు విమానయాన సంస్థలను సంప్రదించారన్న వాదనలను ఖండించింది. ఈ ఆదేశాలను పునఃపరిశీలించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

## ఇరాన్‌పై యుద్ధానికి భారత్‌ను సాయం కోరినట్లు కథనాలు..
# స్పందించిన కేంద్రం


పశ్చిమాసియాలో యుద్ధ తీవ్రత రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఈ నేపథ్యంలోనే ఇరాన్‌ను ఎదుర్కొనేందుకు అమెరికా.. భారత్ నుంచి సైనిక సాయం కోరినట్లు ఇటీవల సామాజిక మాధ్యమాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. దీనిపై విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ స్పందిస్తూ.. ఇవి పూర్తిగా నిరాధారమైన వార్తలంటూ కొట్టిపారేసింది. పశ్చిమ భారత్ నుంచి ఇరాన్‌పై దాడులు చేసేందుకు వీలుగా మిలిటరీ స్థావరాలను వినియోగించుకుంటామని అమెరికా అడిగినట్లు ఆ వార్తల సారాంశం. ఇందుకు సంబంధించి కొన్ని ఆంగ్ల మీడియాల్లోనూ కథనాలు రావడంతో విదేశాంగ శాఖ తమ ఫ్యాక్ట్‌చెక్ లో స్పందించింది. "ఇలాంటి అసత్య వార్తలను నమ్మవద్దు. నిరాధారమైన, కల్పిత విషయాలపై జాగ్రత్తగా ఉండాలని ప్రజలను కోరుతున్నాం" అంటూ పోస్ట్ చేసింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ గతంలోనూ భారత్‌పై పలుమార్లు అసత్య ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. ఇటీవల ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్ దేనా 75పై అమెరికా జలాంతర్గామితో దాడి చేసి ముంచేసింది. ఆ సమయంలోనూ



భారత పోర్టులను అమెరికా ఉపయోగించుకుంటోందన్న వార్తలు వచ్చాయి. వాటిని విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. అవన్నీ తప్పుడు వార్తలే అంటూ తేల్చిచెప్పింది.

# హర్మూజ్ సమీపంలో భారతీయుడు మృతి

హర్మూజ్ జలసంధి సమీపంలో విధులు నిర్వహిస్తున్న ఓ భారతీయుడు మృతి చెందాడు. చమురుతో భారత్‌కు వస్తున్న వాణిజ్య నౌకకు కెప్టెన్‌గా ఉన్న అతడు.. గుండెపోటుతో మరణించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అతడి మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేందుకు సాయం చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఝార్ఖండ్‌లోని రాంచీకి చెందిన రాకేశ్ రంజన్ (43) 'అవానా' చమురు నౌకకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆ నౌక భారత్‌కు బయలుదేరింది. అయితే, యుద్ధం నేపథ్యంలో ఇది హర్మూజ్‌కు 14 నాటికల్ మైళ్ల దూరంలో చిక్కుకుపోయింది. ఈక్రమంలో ఈనెల 18న రంజన్ ఉన్నట్టుండి



కుప్పకూలిపోయాడు. వైద్య సాయం అందించినప్పటికీ.. లాభం లేకుండా పోయింది. ఉద్రిక్తతల నేపథ్యంలో విమానంలో అతడిని తరలించేందుకు అనుమతులు లభించలేదు. ఈ క్రమంలో పడవలో దుబాయ్‌లోని పోర్ట్ రషీద్‌కు తరలించారు. అక్కడ రంజన్ ప్రాణాలు కోల్పోయాడు. గుండెపోటు కారణంగా రంజన్ మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. అయితే, పోస్టుమార్టం తర్వాతే మృతికి గల కచ్చితమైన కారణాలు తెలియనున్నాయి. ఇక, రంజన్ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాయం అందించాలని కుటుంబసభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, రాంచీ ఎంపీ సంజయ్ సేథ్‌లకు లేఖ రాసినట్లు మృతుడి సోదరుడు వెల్లడించారు. రంజన్‌కు భార్యా, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# ప్రజల హక్కులను లాక్కునే ప్రయత్నాలను అడ్డుకుంటాం

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ భాజపాపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)పై తన పోరాటం కొనసాగిస్తానన్న ఆమె.. ప్రజల హక్కులు లాక్కోవడానికి ప్రధాని మోదీ చేసే ప్రయత్నాలను అడ్డుకుంటానన్నారు. రంజాన్ సందర్భంగా సెంట్రల్ కోల్‌కతాలో జరిగిన వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో భాజపా ఉనికి లేకుండా చేయడం, ఆ పార్టీ నుంచి దేశాన్ని రక్షించడమే తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమన్నారు. 'సర్' పేరుతో రాష్ట్రంలోని అనేకమంది ప్రజల పేర్లను తొలగించారన్నారు. దీనిపై ప్రశ్నిస్తూ కులం, వర్గంతో సంబంధం లేకుండా బెంగాల్‌లోని ప్రజలందరికీ తాను తోడుగా



నిలబడ్డానన్నారు. ఈ 'సర్'పై తన పోరాటాన్ని కొనసాగిస్తానని తెలిపారు. ప్రజల హక్కులను లాక్కోవడానికి ప్రధాని చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటానని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వాన్ని నియంత్రించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని, రాష్ట్రపతి పాలన కూడా విధించాలని చూస్తోందని ఆరోపించారు. అయినా.. వీటన్నింటికీ తాము భయపడేది లేదన్నారు. ఈ సందర్భంగా భాజపాపై మమతా పలు విమర్శలు చేశారు. ఓట్లు చీల్చేందుకు కొందరు ద్రోహులు భాజపా నుంచి డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపించారు.

**ఆమె అందుకు అనర్హురాలు..**

ప్రధాని మోదీపై మమతా చేసిన ఆరోపణలను భాజపా తీవ్రంగా ఖండించింది. రాజ్యాంగబద్ధమైన పదవికి ఆమె అనర్హురాలు అని పేర్కొంది. మోదీ మైనారిటీల వ్యతిరేకి అంటూ మమత విమర్శలు చేయడంపై భాజపా నేత శిశిర్ బజోరియా 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయం సీఎంను వెంటాడుతోందని ఎద్దేవా చేశారు.

# మనీలాండరింగ్ కేసులో దోషిగా తేలిన భారత సంతతి జడ్జి

అమెరికాలో మనీ లాండరింగ్‌కు సంబంధించిన కేసులో భారత సంతతికి చెందిన ఓ న్యాయమూర్తి దోషిగా తేలారు. నిధుల దుర్వినియోగం ఆరోపణలతో ఆయనపై నమోదైన అభియోగాలు నిర్ధరణ అయ్యాయి. ఈ మేరకు జ్యూరీ తీర్పు వెలువరించింది. శిక్షను మాత్రం జూన్ 16న ఖరారు చేయనుంది. అక్కడి చట్టాలను అనుసరించి ఆయనకు రెండు నుంచి పదేళ్ల వరకు జైలు శిక్ష, పదివేల డాలర్లు జరిమానా పడే అవకాశం ఉన్నట్లు సమాచారం. భారత్ సంతతికి చెందిన కేపీ జార్జ్.. టెక్సాస్‌లోని ఫోర్ట్ బెండ్ కౌంటీ న్యాయమూర్తిగా పనిచేస్తున్నారు. ప్రచార నిధులను ఆయన సొంత అవసరాలకు వాడుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. దాదాపు 46వేల డాలర్లు వ్యక్తిగత ఖాతాలకు మళ్లించినట్లు అభియోగాలు నమోదయ్యాయి. ఈ క్రమంలో ఇటీవల కోర్టురూమ్ నుంచే ఆయన్ను అధికారులు అదుపులోకి తీసుకోగా.. స్థానిక జైలు నుంచి పూచీకత్తుపై బయటకు వచ్చారు.




# రూ. 10.69 లక్షలకే స్కోడా కుషాక్ ఫేస్‌లిఫ్ట్



ప్రముఖ కార్ల తయారీ కంపెనీ స్కోడా ఆటో ఇండియా ఎస్‌యూవీ విభాగంలో కుషాక్ ఫేస్‌లిఫ్ట్‌ను లాంచ్ చేసింది. దీని ప్రారంభ ధర రూ.10.69 లక్షలు (ఎక్స్ షోరూం)గా కంపెనీ నిర్ణయించింది. టాప్ ఎండ్ వేరియంట్ ధర రూ.18.99 లక్షలు (ఎక్స్ షోరూం)గా కంపెనీ పేర్కొంది. క్లాసిక్+, సిగ్నేచర్, స్పోర్ట్‌లైన్, ప్రెస్టీజ్, మాంటే కార్లో వంటి 5 వేరియంట్‌లలో ఈ మోడల్‌ను తీసుకొచ్చారు. మార్కెట్లో ఉన్న రెనో డస్టర్, హ్యుందాయ్ క్రెటా, కియా సెల్టోస్ వంటి కార్లకు గట్టి పోటీ ఇవ్వనుంది. కుషాక్ ఫేస్‌లిఫ్ట్‌ను కొత్తగా డిజైన్ చేశారు. స్కోడా కొడియాక్ మోడల్ తరహా గ్రిల్, డీఆర్‌ఎల్‌ఎస్ హెడ్‌లైట్స్‌తో పాటు స్కోడా బ్రాండ్ ఎల్‌ఈడీ టెయిల్ లైట్స్‌ను ఇచ్చారు. కారు లోపల యాంబియంట్ లైటింగ్, 2 స్పోక్ స్టీరింగ్ వీల్, 10.25 అంగుళాల డిజిటల్ కాక్‌పిట్‌తో పాటు ఏఐ అసిస్టెంట్‌తో కూడిన 10.1 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ ఉంది. ఈ సెగ్మెంట్‌లో మొదటి సారి వెనుక సీట్లో మసాజ్ ఫంక్షన్‌ను తీసుకొచ్చారు. పనరోమిక్ సన్‌రూఫ్, పవర్ అడ్జస్టబుల్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, వైర్ లెస్ ఛార్జింగ్ స్టేషన్, ఆటోమెటిక్ క్లైమెట్ కంట్రోల్ ఫీచర్లను అమర్చారు. భద్రత కోసం ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, పార్కింగ్ కెమెరా, పార్కింగ్ సెన్సార్, టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్, ఆటో డిమ్మింగ్ ఇన్‌సైడ్ రియర్ వ్యూమిర్రర్ ఇచ్చారు. ఈ మోడల్స్‌లో అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్, 360 డిగ్రీల కెమెరా లేకపోవడం గమనార్హం. 1.0 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్, 6 స్పీడ్ మాన్యుల్ లేదా 8 స్పీడ్ టార్క్ కన్వర్టర్ ఆటోమెటిక్ గేర్ బాక్స్ ఆప్షన్లు ఉన్నాయి. 1.5 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్, 7 స్పీడ్ డీసీటీ ఆప్షన్లలో కారు లభిస్తుంది.

## చేతులు కలపనున్న వొడాఫోన్‌ఐడియా, బీఎస్ఎన్ఎల్..!

అప్పుల్లో కూరుకుపోయి ఇబ్బందులు పడుతున్న టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియా, భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ జట్టు కట్టనున్నాయి. టవర్లు, ఫైబర్ కేబుళ్లు, స్పెక్ట్రమ్‌ను ఈ రెండు సంస్థలు షేర్ చేసుకోనున్నాయి. కవరేజ్ మెరుగుపర్చేందుకు, డబ్బు ఆదా చేసే ఉద్దేశంతో ఈ రెండు సంస్థలు ఇప్పటికే చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. నెట్‌వర్క్ నాణ్యతను మెరుగుపర్చేందుకు, 5జీ విస్తరణను వేగవంతం చేసేందుకు ఈ చర్య ఉపయోగపడొచ్చని భావిస్తున్నారు. ఒకట్రెండు కంపెనీలు ఆధిపత్యం చెలాయించకుండా టెలికాం మార్కెట్‌లో పోటీ ఉండేలా ఇది దోహదపడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 4జీ సైట్స్, అప్‌గ్రేడ్‌ల కోసం ఇవి భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ఇప్పుడు ఈ కంపెనీలు జట్టు కట్టడం వల్ల గ్రామీణప్రాంతాల్లో కూడా కవరేజీ మెరుగుపడనుందని తెలుస్తోంది. బీఎస్ఎన్ఎల్ ప్రభుత్వ రంగ సంస్థ కాగా.. వీఐలో కేంద్రానికి 49 శాతం వాటా ఉంది.

# ఇరాన్ వార్ వేళ మసకబారుతోన్న పసిడి.. అసలు 1983లో ఏమైంది..?



పశ్చిమాసియాలో ఘర్షణలు రోజురోజుకూ తీవ్రం అవుతున్నాయి. అనిశ్చితుల నేపథ్యంలో సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించే బంగారం ధర పెరుగుతుందని ఆశించినా.. అంచనాలకు భిన్నంగా భారీగా పడిపోతోంది. శనివారం అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 4500 డాలర్ల దిగువకు పడిపోయింది. 1983 తర్వాత ఒక వారంలో పసిడి ధర ఈ స్థాయిలో పతనమవడం మళ్లీ ఇప్పుడే. కమోడిటీ ఎక్స్చేంజ్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో ఔన్సు బంగారం ఒక దశలో 2.47 శాతం మేర పతనమై రూ.4,492 వద్ద ట్రేడయింది. ఔన్సు వెండి 5 శాతం కుంగి, 70 డాలర్ల దిగువకు చేరింది. హైదరాబాద్‌లో శనివారం పది గ్రాముల మేలిమి బంగారం 1,49,992గా ఉంది. కొన్ని నెలల క్రితం ఫ్యూచర్స్‌లో వెండి జీవనకాల గరిష్ఠాలకు చేరి, 119 డాలర్లు పలికిన సంగతి తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న పరిణామాలతో ఈ రెండు లోహాల ధరలు ఒత్తిడికి గురవుతున్నాయి. దాంతో రేట్లు పెరిగినా.. మదుపర్లు అందులో పెట్టుబడులు కొనసాగించలేక, తమ వాటాలను ఉపసంహరించుకుంటున్నారు.

**1983లో అసలేం జరిగింది..?**

1979..1980 మధ్యలో బంగారం ధర భారీగా పెరిగింది. ఒక ఔన్సు ధర 850 డాలర్ల పైకి చేరింది. అప్పుడు కూడా ఇరాన్‌లో విప్లవం కారణంగా చమురు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు అది ప్రచ్ఛన్న యుద్ధ సమయం. అంటే యూఎస్ యూఎస్ఎస్ఆర్ వంటి రెండు శక్తిమంతమైన దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగాయి. ఈ అనిశ్చితితో అప్పటివరకు కొన్నేళ్లపాటు పరుగులు పెట్టిన పుత్తడి బుడగ 1983లో పగిలిపోయింది. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించే లక్ష్యంతో యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లను పెంచాలని నిర్ణయం తీసుకోవడం షాకిచ్చింది. అమెరికా డాలర్‌ను బలోపేతం చేసే చర్యగా దానిని భావించారు. దాంతో ఔన్సు పుత్తడి ధర 15-20 శాతం మేర పడిపోయి, 400 డాలర్ల దిగువకు చేరింది. ప్రస్తుత ఘర్షణల వల్ల బ్యారెల్ ముడిచమురు దాదాపు 40 డాలర్ల వరకు పెరిగినా బంగారం ధర మాత్రం పెరగకపోగా.. మరింత తగ్గుతోంది. డాలర్‌కు గిరాకీ పెరగడం వల్ల, పెట్టుబడులు అటు మళ్లడమే ఈ పరిస్థితికి కారణమనే విశ్లేషణలు ఉన్నాయి. బ్యారెల్ చమురు ధర 200 డాలర్లకు చేరితే మాత్రం, బంగారం ప్రస్తుత స్థాయుల నుంచి 15-20% మేర పెరిగి ఔన్సు 5,400-6,000 డాలర్లు పలకొచ్చని అంచనాలున్నాయి. వెండి ఔన్సు ధర ప్రస్తుతం 76 డాలర్ల వద్ద ఉన్నా, ఇది 110-130 డాలర్లకు చేరొచ్చనీ పేర్కొంటున్నారు. ఇవన్నీ కూడా పలు అంతర్జాతీయ అంశాలపై ఆధారపడి ఉంటాయన్న సంగతి తెలిసిందే.

# మధుమేహ నియంత్రణకు డాక్టర్ రెడ్డీస్ 'ఓబెడా' సెమాగ్లుటైడ్ జనరిక్




హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఫార్మ కంపెనీ డాక్టర్ రెడ్డీస్ లాబొరేటీస్ టైప్ 2 మధుమేహం నియంత్రణ కోసం జనరిక్ సెమాగ్లుటైడ్ ఇంజెక్షన్‌ను ఆవిష్కరించింది. 'ఒబెడా' బ్రాండ్‌తో ఈ ఔషధాన్ని తీసుకొచ్చింది. సెమాగ్లుటైడ్ ఔషధానికి మనదేశంలో పేటెంట్ గడువు ముగిసినందున, దీని జనరిక్ ఔషధాన్ని విడుదల చేస్తున్నామని డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. ఒబెడా జనరిక్ సెమాగ్లుటైడ్ ఔషధాన్ని ప్రీ ఫిల్డ్ పెన్, డిస్పోజల్ పెన్ రూపంలో తీసుకొచ్చింది. 2 ఎంజీ, 4 ఎంజీ సామర్థ్యంతో ఈ ఔషధాలు లభిస్తాయి. ప్రతి పెన్ నాలుగు వారాల డోస్‌లను అందిస్తుందని కంపెనీ తెలిపింది. ధర నెలకు రూ. 4200 నుంచి ప్రారంభమవుతుంది. అంతర్జాతీయ సంస్థ నోవో నార్డిస్క్ విక్రయించిన ధర కంటే 62 శాతం తక్కువ ధరకే లభిస్తుందని కంపెనీ పేర్కొంది. ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచి, చక్కెర స్థాయులను నియంత్రించే జీఎల్‌పీ 1 రిసెప్టార్ అగోనిస్ట్ అయిన సెమాగ్లుటైడ్.. టైప్ 2 మధుమేహం తో పాటు, బరువు తగ్గించడం, గ్లూకోజ్ స్థాయిలను అదుపుచేయడంలో వైద్యపరంగా మెరుగైన ఫలితాలను ఇస్తోంది. డాక్టర్ రెడ్డీస్‌తో పాటు ఇతర ఫార్మా కంపెనీలైన సన్ ఫార్మా, జైడస్ లైఫ్ సైన్సెస్, గ్లెన్ మార్క్‌లు కూడా తమ జనరిక్ సెమాగ్లూటెడ్ ఔషధాలను విడుదల చేశాయి. శుక్రవారం నాట్కో ఫార్మా కంపెనీ జెనరిక్ ఔషధాన్ని విడుదల చేసిన సంగతి తెలిసిందే.

# అప్పుడు 7 కిలోలు తగ్గా: శ్రేయస్ అయ్యర్



తనను రూ.26.75 కోట్లకు కొనుగోలు చేసిన పంజాబ్ కింగ్స్‌ను ఐపీఎల్ 2025 సీజన్‌లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఫైనల్‌కు చేర్చాడు. బ్యాటర్‌గానూ ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఆర్సీబీ చేతిలో ఓటమితో రన్నరప్‌గా నిలిచినా.. పంజాబ్ కింగ్స్ పోరాటం మాత్రం అదిరిపోయింది. అయితే, శ్రేయస్‌కు భారత జట్టు తరఫున మాత్రం పెద్దగా అవకాశాలు రాలేదు. గాయం వల్ల ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్‌లోనూ చోటు దక్కలేదు. దీంతో తనకు గతేడాది చాలా కష్టంగా గడిచిందని తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. గాయం వల్ల దాదాపు ఏడు కేజీల బరువు కూడా తగ్గినట్లు తెలిపాడు. గాయం నుంచి కోలుకొని రావడం చాలా కష్టమని వెల్లడించాడు.


''గాయం వల్ల నేను దాదాపు ఏడు కేజీలు బరువు తగ్గా. దానినుంచి కోలుకొని రావడం పెద్ద సవాల్‌గా నిలిచింది. నాకైన గాయం చాలా ప్రమాదకరమైందే. అయితే, రెండు నెలలు తీవ్రంగా కష్టపడిన తర్వాత.. ఇప్పుడు నా శరీరాకృతి బాగుంది. కానీ, ఫిట్‌గా ఉంటూనే ఏడు కేజీల బరువు పెరగాలంటే చాలా శ్రమించాలి. నాకు సవాళ్లు అంటే చాలా ఇష్టం. తప్పకుండా ఆ పరిస్థితిని అధిగమిస్తా. ఇలాంటివి ఎన్నోసార్లు అనుభవించా. కమ్‌బ్యాక్ చేసి భారత జట్టుకూ ఆడిన రోజులు ఉన్నాయి'' అని శ్రేయస్ తెలిపాడు.

**అంచనాలు భారీగానే..**

''గతేడాది మేం ఫైనల్‌కు వచ్చాం. రన్నరప్‌గా నిలిచాం. దీంతో ఈసారి మాపై భారీగానే అంచనాలు ఉంటాయి. ఎప్పుడు అడుగు వేసినా.. విజయం సాధించేందుకే ప్రయత్నిస్తాం. నా కన్ను ట్రోఫీ పైనే ఉంది. గత రెండు నెలలుగా మేమంతా ఓ కుటుంబంలా కలిసి ఉన్నాం. ఒకరినొకరం అర్థం చేసుకున్నాం. ప్రతి మ్యాచ్‌కు రెండు లేదా మూడు రోజుల ముందే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటాం. మైదానం ఆవల ఉండే బాండింగ్‌తోనే మ్యాచ్‌లో మెరుగ్గా రాణించేందుకు ఎక్కువ అవకాశం ఉంటుంది'' అని శ్రేయస్ తెలిపాడు.




# నా రాజీనామాకు.. జై షాతో సంబంధమే లేదు



''నన్ను బీసీసీఐ గత 23 ఏళ్లుగా విస్మరించింది. అందుకే, కామెంటేటర్ బాధ్యతలకు రాజీనామా చేస్తున్నా''.. ఇదీ మాజీ క్రికెటర్ శివరామకృష్ణన్ నిన్న చేసిన వ్యాఖ్యలు. దీంతో అతడిని పక్కనపెట్టడం వెనుక బీసీసీఐ కార్యదర్శిగా వ్యవహరించిన జైషా ఉన్నారని సోషల్ మీడియా వేదికగా విమర్శలు వచ్చాయి. ఇప్పుడు వాటన్నింటినీ తోసిపుచ్చుతూ శివరామకృష్ణన్ మరో పోస్టు పెట్టారు. దీని వెనుక బీసీసీఐకి చెందిన ఓ ఉద్యోగి ఉన్నాడని.. మిగతా అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధం లేదని స్పష్టం చేశాడు. ''నా రాజీనామా చిత్రంలోకి బీసీసీఐ అడ్మినిస్ట్రేషన్‌ను తీసుకురావొద్దు. బీసీసీఐలోని ఒకే ఒక్క ఉద్యోగి చేసిన నిర్వాకం ఇది. జైషాతోపాటు ఇతర పెద్దలకు ఇందులో ఎలాంటి పాత్ర లేదు. నా జీవిత పగ్గాలను నా చేతిలోకి తీసుకుంటున్నా. అలా చేసే హక్కు ఉందని భావిస్తున్నా'' అని వెల్లడించారు. శివరామకృష్ణన్ 2000 నుంచి కామెంట్రీ చేయడం మొదలుపెట్టారు. ఐసీసీ క్రికెట్ కమిటీలోనూ ప్రతినిధిగా వ్యవహరించిన అనుభవం ఉంది. అయితే టాస్‌తోపాటు అవార్డుల ప్రజెంటేషన్ కార్యక్రమాల్లో తనకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆరోపిస్తూ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. బీసీసీఐ తనను 23 ఏళ్ల నుంచి నిర్లక్ష్యానికి గురి చేసిందని విమర్శించారు. ఇప్పుడు తాజా కామెంట్లతో భవిష్యత్తులో ఎలాంటి పాత్ర పోషిస్తాడనేది ఆసక్తికరంగా మారింది.

# ఐపీఎల్ ఫాస్టెస్ట్ బౌలర్.. ఘనమైన కమ్‌బ్యాక్‌పై గురి!



ఐపీఎల్ చరిత్రలో 156.7 కి.మీల స్పీడ్‌తో అత్యంత వేగంగా బంతిని విసిరిన బౌలర్ మయాంక్ యాదవ్. ఇప్పటి వరకూ అతడిదే రికార్డు. ఇలాంటి పేసర్ గుర్తున్నాడా..? గాయం కారణంగా గత సీజన్ మొత్తానికి దూరమైన ఈ పేస్ సెన్సేషన్ మళ్లీ ఐపీఎల్‌లో అడుగు పెట్టేందుకు సిద్ధమయ్యాడు. మరో వారం రోజుల్లో ప్రారంభం కానున్న 19వ సీజన్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాడు. ఇప్పటికే లఖ్‌నవూ మైదానంలో ప్రాక్టీస్ కూడా మొదలుపెట్టేశాడు.

**సీఓఈలో..**

బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్సీలో ఉంటూ గాయం నుంచి కోలుకున్న 23 ఏళ్ల మయాంక్ తన బౌలింగ్‌కు మరింత పదును పెట్టాడు. తరచూ గాయాలతో సావాసం చేసే అతడు.. ఇప్పుడు పూర్తిస్థాయి ఫిట్‌నెస్ సాధించడంతో లఖ్‌నవూ జట్టులో జోష్ తెప్పించినట్లైంది. మానసికంగా సిద్ధంగా ఉన్నానని మయాంక్ స్పష్టం చేశాడు. గత పది నెలల కాలంలో కేవలం రెండే మ్యాచులను మాత్రమే ఆడాడు. అదీనూ భారత్ A తరఫున కావడం గమనార్హం. అయినా, బౌలింగ్‌లో లయను అందుకొనేందుకు కష్టపడినట్లు క్రికెట్ వర్గాలు తెలిపాయి.


**నేను రెడీ..**

''ఇప్పుడు చాలా బాగున్నా. పూర్తిస్థాయిలో రెడీ. ఎలాంటి ఇబ్బందులు లేవు. వేగంగా వేయడంపై బయట నుంచి వచ్చే వ్యాఖ్యలను పట్టించుకోను. ఎంత ఫాస్ట్‌గా బంతిని విసురుతానో మీరూ చూద్దురు. ఆట నుంచి సుదీర్ఘమైన లేఆఫ్ తీసుకున్నా. గత పది నెలల్లో కనీసం ఒక్క మ్యాచ్ కూడా ఆడలేకపోయా. అయితే, అప్పుడు ఎలాంటి ఉద్దేశంతో ఉన్నానో.. నా కమ్‌బ్యాక్‌లోనూ అదే దూకుడుతో బౌలింగ్ చేస్తా. గాయాలను మేనేజ్ చేయడం మన చేతుల్లో లేదు.. కానీ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడమే చేయగలను'' అని మయాంక్ యాదవ్ నమ్మకంగా చెబుతున్నాడు. ఐపీఎల్ 2024 సీజన్‌లో నాలుగు మ్యాచుల తర్వాత గాయంతో ఇబ్బంది పడ్డాడు. అతడిపై నమ్మకం ఉంచిన లఖ్‌నవూ మేనేజ్‌మెంట్ రూ. 11 కోట్లకు రిటైన్ చేసుకుంది. కానీ, గత సీజన్‌లోనూ కేవలం రెండు మ్యాచులకే పరిమితం కావాల్సి వచ్చింది. వెన్నునొప్పి తీవ్రత కారణంగా జాతీయ జట్టులోనూ ఆడలేకపోయాడు. దీంతో న్యూజిలాండ్‌లో శస్త్రచికిత్స చేయించుకుని మరీ వచ్చాడు.

# మార్చడమే పని.. కోచ్‌ల నియామకం ఎందుకు?: పాక్ మేనేజ్‌మెంట్‌పై కిరిస్టెన్ ఆగ్రహం

పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు కేవలం ఆరు నెలలు మాత్రమే కోచ్‌గా చేసిన గ్యారీ కిరిస్టెన్ 'నాకొద్దు బాబోయ్' అంటూ వెళ్లిపోయాడు. రెండేళ్ల కాంట్రాక్ట్ ఇచ్చినప్పటికీ.. రాజీనామా చేయక తప్పని పరిస్థితి ఎదురైంది. టీ20 ప్రపంచ కప్ నుంచి పాకిస్థాన్ తొలి దశలోనే వెనుదిరగడంతో పీసీబీ పెద్దలు పొమ్మనలేక పొగబెట్టారు. తన ఆరు నెలల కోచింగ్ కాలాన్ని తాజాగా ఓ ఇంటర్వ్యూలో కిరిస్టెన్ గుర్తు చేసుకున్నాడు. టీమ్‌ఇండియా 2011 వన్డే ప్రపంచ కప్ నెగ్గినప్పుడు కిరిస్టెన్ ప్రధాన కోచ్‌గా ఉన్న సంగతి తెలిసిందే. 'పాకిస్థాన్ క్రికెట్‌లో మేనేజ్‌మెంట్ కలగజేసుకొనే విధానం చూస్తే చాలా ఆశ్చర్యమేస్తుంది. అంతకుముందెప్పుడూ ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోలేదు. కాబట్టే ఓ కోచ్‌గా వచ్చాక.. అనుకున్న ఫలితాలను సాధించేందుకు అవసరమైన ఫార్ములాను అమలు చేయడంలో ఇబ్బందులు పడ్డా. ఏం చేద్దామన్నా బయట నుంచి గోలపెడుతూనే ఉంటారు.

# చలికాలంలో ఊపిరితిత్తులను కాపాడుకోవడం ఎలా?




చలికాలం.. ఊరితిత్తులకు సంబంధించిన సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి ఈ ఊపిరితిత్తులను ఎలా కాపాడుకోవాలి? శ్వాస కోస వ్యాధులు రాకుండా ఎలా కాపాడుకోవాలో ఈ కథనంలో తెలుసుకుందాం. చలికాలంలో ఉష్ణోగ్రత తగ్గుముఖం పట్టడం వల్ల చాలా మందికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడుతుంది. చల్లని, పొడి గాలి, అలాగే వాతావరణ మార్పులు ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తాయి. చల్లని గాలి మన ఊపిరితిత్తులలోకి ప్రవేశించినప్పుడు.. అది శ్వాస సామర్థ్యంపై ప్రభావం చూపుతుంది. దీని వల్ల దగ్గు, ఆస్తమా, బ్రాంకైటిస్ వంటి సమస్యలు వస్తాయి. ఈ పరిస్థితులను ఎదుర్కోవటానికి జాగ్రత్తగా ఉండటం, సరైన చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యం. వైద్య నిపుణుల ప్రకారం.. శీతాకాలంలో చల్లని గాలి ఊపిరితిత్తులకు కష్టంగా ఉంటుంది. ఇది మన శ్వాస గొట్టాన్ని ఇబ్బందికి గురి చేస్తుంది. చల్లని, పొడి గాలి కూడా అలెర్జీలు, ఇన్ఫెక్షన్లను పెంచుతాయి.

### చలికాలంలో కాలుష్యం పెరగడమే అతిపెద్ద సమస్య..

చలికాలంలో బలహీనంగా మారిన ఊపిరితిత్తులపై మరింత ఒత్తిడి తెచ్చే పొగ, ధూళి కణాలు ఈ సమయంలో మరింత చురుగ్గా మారతాయి. ముఖ్యంగా ఉబ్బసం రోగులకు, చల్లని గాలి వారి లక్షణాలను మరింత తీవ్రతరం చేస్తుంది. చల్లటి, కలుషితమైన గాలిని పీల్చడం వల్ల శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది మాత్రమే కాకుండా ఊపిరితిత్తులలో మంట, ఇన్ఫెక్షన్ కూడా వస్తుంది. ఇంతే కాకుండా.. శీతాకాలంలో రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది . శారీరక శ్రమ లేకపోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గి, సీజనల్ ఫీవర్, జలుబు వంటి సమస్యలు వస్తాయి.

### తీసుకోవాల్సిన చర్యలు..

ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. సమతుల్య ఆహారం తీసుకోండి. మిమ్మల్ని మీరు హైడ్రేట్ గా ఉంచుకోండి. హైడ్రేషన్ ఊపిరితిత్తులను తేమగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇది శ్వాసను సులభతరం చేస్తుంది. దుమ్ము మరియు పొగకు దూరంగా ఉండండి. ఎవరైనా.. శీతాకాలంలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిని అనుభవిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ప్రారంభ చికిత్సతో తీవ్రమైన సమస్యలను నివారించవచ్చు. అంతే కాకుండా మీ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, దుమ్ము, పొగ నుంచి దూరంగా ఉండటం ముఖ్యం.



# పాలు మంచివేనా? ఉబకాయం ఉన్నోళ్లు తాగొచ్చా?



ఇటీవల ఉబకాయం అనే సమస్య చాలా మందిని వేదిస్తోంది. దీంతో ఏ ఫుడ్ తీసుకోవాలో.. ఏ ఫుడ్ తీసుకోవొద్దో తెలియక వారు తికమక పడుతున్నారు. అయితే ఇప్పటివరకు హెల్తీ అనుకున్న పాలు కూడా.. ఇప్పుడు అన్ హెల్దీ అన్న టాక్ వస్తోంది. ముఖ్యమంత్రి ఉబకాయం ఉన్నోళ్లు పాలు తాగొద్దని ఆహార నిపుణులు సూచిస్తున్నారు.

ప్రస్తుత కాలంలో చాలా మందిని కొవ్వు (కొలెస్ట్రాల్) సమస్య వేధిస్తోంది. దీని కారణంగా శరీర బరువు భారీగా పెరిగిపోతోంది. ఇలాంటి సమస్యను ఎదుర్కొంటున్న వారు ఏం తినాలన్నా, తాగాలన్నా ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తుంటారు. ఏం తింటే ఏమవుతుందో అనే భయంతో కొన్ని ఆహార పదార్థాలను తినడం, తాగడం మానేస్తున్నారు. ఈ లిస్టులో మొదటి స్థానంలో వచ్చేది పాలు.పాలు తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఒకేసారి లభిస్తాయి. అందుకే రోజూ కనీసం ఒక గ్లాసు పాలు తాగాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తారు. పాలు తాగడం వల్ల బలమైన ఎముకలకు అవసరమైన కాల్షియంను అందిస్తుంది. అంతే కాకుండా.. శరీరానికి కావాల్సిన అవసరమైన అనేక ఖనిజాలు, విటమిన్లు పాలలో నుంచి లభిస్తాయి. అయితే.. పాలు తాగితే బరువు పెరగడం కూడా ముడిపడి ఉంది. బరువు పెరుగుతుందనే భయంతో చాలా మంది పాలు తాగరు. అయితే పాలు తాగడం వల్ల ఊబకాయం పెరుగుతుందా..? అనే దానికి వివరాలు తెలుసుకుందాం... పాలలో పోషకాలతో పాటు, కేలరీలు కూడా ఎక్కువగా ఉంటాయి. ఈ క్రమంలో.. అధిక మొత్తంలో పాలు తాగడం వలన ఊబకాయానికి దారి తీస్తుంది. అయితే, కొన్ని ప్రత్యేక విషయాలపై శ్రద్ధ పెడితే.. పాలు తాగితే బరువు పెరిగే ప్రమాదాన్ని సులభంగా తగ్గించుకోవచ్చు.

పాలు తాగడంవలన బరువు తగ్గే సరైన మార్గం ఏమిటి..?




మీరు మీ బరువును నియంత్రించుకోవడానికి పాలు తాగేటప్పుడు కేలరీలను తగ్గించాలి. అందు కోసం.. ఎక్కువ పరిమాణంలో పాలు తాగడం మానుకోండి. అంతే కాకుండా.. పాలలో కేలరీల పరిమాణాన్ని తగ్గించడానికి, మొత్తం పాలకు బదులుగా స్కిమ్డ్ మిల్క్ తీసుకోండి. అంటే.. పాల నుండి మీగడను పూర్తిగా తీసివేసి తాగండి. 1 గ్లాసు మొత్తం కొవ్వు పాలలో 146 కేలరీలు, కొవ్వు లేని పాలలో 86 కేలరీలు ఉంటాయి. ఈ క్రమంలో.. మీ అవసరాన్ని బట్టి సరైన పాలను తాగాలి. మీరు బరువు తగ్గించే డైట్‌లో ఉన్నట్లయితే.. మీ రోజువారీ కేలరీల కౌంట్‌ను దృష్టిలో ఉంచుకుని పాలను తీసుకోవాలి.

## కాజు హల్వా .. ఇలా ప్రిపేర్ చేసుకోండి.. !



దీపావళి పండగకు చాలా మంది స్వీట్స్ తింటూ ఉంటారు. అలాగే ఇంటికి వచ్చే అతిథులకు బహుమతిగా ఈ స్వీట్స్ ఇస్తూ ఉంటారు. దీనికోసం షాపుల నుంచి స్వీట్స్ తీసుకొని ఇస్తారు. కానీ ఈ దీపావళికి స్వీట్స్ బయటి నుంచి కాకుండా ఇంట్లోనే చేసి తినడడంతో పాటు, మీ ఇంటికి వచ్చిన అతిథులకు కూడా ఇస్తే చాలా బాగుంటుంది. అందుకే కాజు హల్వా అనేది బెస్ట్ ఆప్షన్ అని చెప్పుకోవచ్చు. యితే ఈ కాజు హల్వాను ఎలా చేసుకోవాలి, దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి, ఎలాంటి పద్ధతుల్లో హల్వా చేసుకుంటే రుచి అమోఘంగా వస్తుందనేది ఈ స్టోరీలో చూద్దాం.



| కాజు హల్వా తయారీకి కావాల్సిన పదార్థాలు |
|---|
| గోధుమ పిండి |
| కుంకుమ పువ్వు |
| జీడిపప్పు |
| పంచదార లేదా వీలైతే బెల్లం పొడి |
| నెయ్యి |
| యాలకుల పొడి |
| డ్రై ఫ్రూట్స్ |

**కాజు హల్వా తయారీ విధానం**

ఈ కాజు హల్వా తయారు చేయడానికి ముందుగా జీడిపప్పును మెత్తగా పొడి చేసుకొని పక్కకు పెట్టుకోవాలి. అనంతరం ఒక గిన్నె తీసుకొని అందులో నీళ్లు పోసి మరిగించండి. నీళ్లు మరిగాక అందులో పంచదార లేదా బెల్లం పొడి వేసి, మంటను హైలో పెట్టి అది కరిగేంత వరకు మరిగించుకోవాలి. ఆ సమయంలోనే అందులో యాలకుల పొడి, కుంకుమ పూల రేకులు వేసి కొంచెం సేపు మరిగించుకొని పక్కకు పెట్టుకోవాలి.అనంతరం మరొక గిన్నె తీసుకొని అందులో నెయ్యి వేసి.. అందులోనే గోధుమ పిండి, పిండిలా చేసుకున్న జీడిపప్పును వేయించాలి. ముఖ్యంగా మాడిపోకుండా చూసుకోవాలి. అనంతరం ఆ పిండిలో మనం ముందుగా చేసి పెట్టుకున్న పంచదార లేదా బెల్లం పొడితో చేసుకున్న పాకంను పోసి మెల్లమెల్లగా కలుపుకోవాలి. ఉండలు లేకుండా, మిశ్రమం దగ్గర పడే కొద్దీ కలుపుకుంటూ ఉండాలి. అనంతరం ఒక బౌల్‌లో ఆ హల్వాను వేసుకొని దానిపై కొన్ని డ్రై ఫ్రూట్స్ స్లైసెస్‌ను గార్నిష్ చేసుకుంటే సరిపోతుంది. దీపావళికి ఎంతో రుచికరమైన కాజు హల్వా సిధమైనట్లే.



# కుటుంబ సభ్యులతో 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా చూసిన చిరంజీవి..

- 'ఉస్తాద్ భగత్ సింగ్' స్పెషల్ స్క్రీనింగ్
- కుటుంబసమేతంగా సినిమాను పూర్తిగా ఆస్వాదించిన మెగాస్టార్
- చిత్ర బృందం కృషిని అభినందించిన చిరంజీవి
- 'వాన వాన వెల్లువాయే', 'ఈ మనసే' పాటలకు ప్రత్యేక ప్రశంస
- ఉగాది కానుకగా మార్చి 19న ఈ చిత్రం విడుదల



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' పై మెగాస్టార్ చిరంజీవి ప్రశంసల వర్షం కురిపించారు. ఆయన తన కుటుంబసభ్యులతో కలిసి ఈ సినిమాను ప్రత్యేకంగా వీక్షించారు. సినిమాను ప్రతి క్షణం ఆస్వాదించానని, తమ్ముడి నటన అద్భుతంగా ఉందని ఆయన అభినందించారు. వివరాల్లోకి వెళితే, హరీశ్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం ఉగాది కానుకగా మార్చి 19న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలో, తన తమ్ముడి సినిమాను వీక్షించిన చిరంజీవి పూర్తిస్థాయిలో సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా, ఈ చిత్రంలోని 'వాన వాన వెల్లువాయే', 'ఈ మనసే' పాటలు తెరపై రాగానే ఆయన ముఖంలో ఆనందం కనిపించింది. ఈ పాటల చిత్రీకరణ, సంగీతం పట్ల ఆయన ప్రత్యేకంగా స్పందించారు. పవన్ కల్యాణ్ నటనతో పాటు, దర్శకుడు హరీశ్ శంకర్ టేకింగ్, చిత్ర బృందం పడిన కష్టాన్ని చిరంజీవి ప్రత్యేకంగా అభినందించారు. కాగా, ఈ స్పెషల్ స్క్రీనింగ్ కు పవన్ కల్యాణ్, ఆయన భార్య అన్నా లెజినోవా కూడా విచ్చేశారు. వారు థియేటర్లో చిరంజీవి, సురేఖ దంపతుల పక్కనే కూర్చున్నారు.

## 'రాకాస'తో వస్తున్న కొణిదెల నిహారిక..



మెగా ఫ్యామిలీ నుంచి హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చి, ఆ తర్వాత నిర్మాతగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నిహారిక కొణిదెల ఇప్పుడు ఫుల్ జోష్‌లో ఉన్నారు. 'పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్' బ్యానర్‌పై ఆమె నిర్మించిన 'కమిటీ కుర్రాళ్ళు' భారీ విజయం సాధించడంతో, ఇప్పుడు తన తదుపరి చిత్రం 'రాకాస'తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు. సంగీత్ శోభన్ హీరోగా నటించిన ఈ చిత్రంపై నిహారిక ధీమాగా ఉన్నారు. ఈ చిత్రం ఏప్రిల్ 3న థియేటర్లలో సందడి చేయనుంది. ఇది ఒక 'హర్రర్ కామెడీ ప్లస్ ఫాంటసీ' జానర్‌లో తెరకెక్కిన సినిమా. కుటుంబ సభ్యులందరూ కలిసి చూసేలా క్లీన్ ఎంటర్‌టైనర్‌గా దీనిని రూపొందించామని నిహారిక తెలిపారు. ఇప్పటికే సంగీత్ శోభన్‌తో 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ' వంటి హిట్ వెబ్ సిరీస్ నిహారిక నిర్మించారు. ఇప్పుడు అదే కాంబోలో సినిమాతో వస్తుండటం విశేషం. ప్రస్తుతం నటనకు దూరంగా ఉన్న నిహారిక, మళ్ళీ మేకప్ వేసుకోవాలని నిర్ణయించుకున్నారు. తాజాగా ప్రమోషన్లలో ఆమె మాట్లాడుతూ తన సెకండ్ ఇన్నింగ్స్ గురించి క్లారిటీ ఇచ్చారు. గత కొంతకాలంగా అనేక కథలు వింటున్నానని, అందులో కొన్ని స్క్రిప్ట్స్ తనకు బాగా నచ్చాయని చెప్పారు. అన్నీ కుదిరితే 2027లో మళ్ళీ హీరోయిన్‌గా వెండితెరపై కనిపించే అవకాశం ఉందని ఈ మెగా ముద్దుగుమ్మ వెల్లడించారు.

# సినిమా



## తెలుగులోనూ రెడీ

బాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రణవీర్ సింగ్, సెన్సేషనల్ డైరెక్టర్ ఆదిత్య ధర్ కాంబినేషన్‌లో తెరకెక్కిన హైవోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ ధురంధర్ 2: ది రివెంజ్ ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టిస్తోంది. గతేడాది సంచలనం సృష్టించిన ధురంధర్ కు సీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రం, ప్రపంచవ్యాప్తంగా భారీ ఓపెనింగ్స్‌తో అదరగొట్టింది. హిందీ వెర్షన్ బ్లాక్‌బస్టర్ టాక్‌తో దూసుకుపోతున్నప్పటికీ, తెలుగు రాష్ట్రాల్లోని అభిమానులకు మాత్రం గత రెండు రోజులుగా నిరాశే ఎదురైంది. సాంకేతిక కారణాలు, సెన్సార్ బోర్డు ఆఖరి నిమిషంలో సూచించిన మార్పుల వల్ల తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ వెర్షన్ల విడుదల వాయిదా పడింది. అయితే ఈ నిరీక్షణకు ఇక తెరపడింది. సినిమా యూనిట్ ఎదుర్కొన్న సాంకేతిక చిక్కులు, సెన్సార్ సమస్యలన్నీ పూర్తిగా తొలగిపోయాయి. ఇవాళ్టి నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని థియేటర్లలో ధురంధర్ 2 తెలుగు వెర్షన్ అధికారికంగా ప్రదర్శించబడనుంది. ఇప్పటికే బుకింగ్ ప్లాట్‌ఫామ్స్‌లో తెలుగు షోలు కనిపిస్తుండటంతో అభిమానులు పెద్ద ఎత్తున టిక్కెట్లు బుక్ చేసుకుంటున్నారు.

## జానపద కళాకారిణి

# బయోపిక్‌లో శ్రద్ధా కపూర్

కళ కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టిన మహోన్నత జానపద కళాకారిణి విఠాబాయి భౌ మాంగ్ నారాయణగాంకర్ జీవిత కథ ఇప్పుడు విఠా పేరుతో వెండితెర పై ఆవిష్కృతం కాబోతోంది. జీవితాంతం కళకే అంకితమైన మహారాష్ట్రకు చెందిన ఈ తమాషా కళాకారిణి బయోపిక్ లో ఇప్పుడు బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్ర పోషిస్తుంది. విఠాభాయి జీవితంలో ఎన్నో సాహస ఘట్టాలు ఉన్నాయి. భారత్ చైనా యుద్ధం జరుగుతున్న క్లిష్ట సమయంలో విఠాబాయి ప్రదర్శనలు దేశభక్తిని చాటాయి. యుద్ధ భూమిలో అలసిపోయిన భారత సైనికులకు తన జానపద ప్రదర్శనల ద్వారా వినోదాన్ని, మానసిక ఉల్లాసాన్ని పంచిన గొప్ప దేశభక్తురాలు ఆమె. సరిహద్దుల్లో సైనికుల నడుమ ఆమె చేసిన నృత్యాలు ఆనాటి కాలంలో ఎంతో ప్రాచుర్యం పొందాయి. మహారాష్ట్రలో తమాషా కళకు ఆమె ఒక బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారు. తన విలక్షణమైన శైలితో అద్భుతమైన అభినయంతో దశాబ్దాల పాటు ప్రజలను అలరించారు. ఆమె ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం అనేక పురస్కారాలతో గౌరవించింది. జానపద కళను బతికించడం కోసం ఆమె పడ్డ తపన, ఎదుర్కొన్న పేదరికం, సామాజిక వివక్షను నేటి బయోపిక్‌లో కళ్లకు కట్టినట్లు చూపించబోతున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ మరాఠీ దర్శకుడు సంజయ్ జాదవ్ దర్శకత్వం వహిస్తున్నాడు.



## ఇది సినిమా కాదు... రీసెట్ బటన్

## ధురంధర్-2పై రామ్ గోపాల్ వర్మ



ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ 'ధురంధర్ 2' చిత్రంపై తనదైన శైలిలో వ్యాఖ్యలు చేశారు. ధురంధర్ ది రివెంజ్ చిత్రం భారతీయ సినిమా గతిని మార్చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇది కేవలం ఒక సినిమా కాదని, ఇండియన్ సినిమాకు ఒక 'రీసెట్ బటన్' అని వర్మ అభివర్ణించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఇతర ఫిల్మ్ మేకర్స్‌ను ఉద్దేశిస్తూ వర్మ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "2026 మార్చి 19కు ముందు తీసిన సినిమాలన్నింటినీ మరిచిపోకపోతే ఫిల్మ్ మేకర్స్ మూర్ఖులవుతారు. ఆ తేదీ నుంచి ప్రతి ఒక్కరూ తమ సినిమాలను 'ధురంధర్ 2'తో పోల్చుకోవాలి. లేదంటే దాని అగ్నిలో కాలి బూడిదైపోతారు" అని వర్మ తన పోస్టులో పేర్కొన్నారు. రణవీర్ సింగ్, దర్శకుడు ఆదిత్య ధర్ కాంబోలో ఇంతకుముందు వచ్చిన ధురంధర్ చిత్రం ఎంతటి బ్లాక్ బస్టరో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దానికి సీక్వెల్ గా వచ్చిన ధురంధర్ ది రివెంజ్ మూవీ మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా రిలీజై... బాక్సాఫీసు వద్ద ప్రభంజనం సృష్టిస్తోంది. భారతీయ సినీ రికార్డులను తిరగరాసే దిశగా దూసుకెళుతోంది.

## చిరు, కమల్, బన్నీ, ఎన్టీఆర్.. అభిమానులకు ఈద్ విషెస్

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని దక్షిణాది సినీ పరిశ్రమకు చెందిన పలువురు అగ్ర తారలు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఇవాళ పండుగ సందర్భంగా చిరంజీవి, కమల్ హాసన్, అల్లు అర్జున్, జూనియర్ ఎన్టీఆర్, విజయ్ సేతుపతి వంటి స్టార్లు సోషల్ మీడియా వేదికగా తమ సందేశాలను పంచుకున్నారు. శాంతి, సంతోషం, సౌభాగ్యంతో అందరి జీవితాలు నిండిపోవాలని ఆకాంక్షించారు. "ఇస్లామిక్ సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం, కష్టాల్లో ఉన్నవారి కన్నీళ్లు తుడవడం వంటి దయాగుణమే నిజమైన సేవ అని ఈ పండుగ నేర్పుతుంది" అని కమల్ హాసన్ తన ఈద్ సందేశంలో పేర్కొన్నారు.

## అపోహపై స్పష్టత



నైంటీస్‌లో కుర్రకారు గుండెల్లో చెరగని ముద్ర వేసిన నటీ ప్రీతి జింటా. తాజాగా తన కేరీర్ లో ఫస్ట్ సినిమాకి సంబంధించిన విషయాలను ఓ ఇంటర్వ్యూలో పంచుకుంది. ఇన్నేళ్లుగా తన తొలి సినిమా దిల్ సే అని ప్రచారంలో ఉంది. కానీ వాస్తవానికి తాను అంతకుముందే క్యా కెహనా అనే సినిమాకు ఓకే చెప్పినట్లు తెలిపింది. అయితే అలస్యం కారణంగా అది తర్వాత విడుదలైందని వెల్లడించింది. సాంకేతికంగా తన మొదటి సినిమా శేఖర్ కపూర్ తీసిన తారా రమ్ పమ్ పమ్ అయి ఉండాల్సిందని తెలిపారు. కానీ ఆ సినిమా సిల్వర్ స్కీన్ పైకి కాకుండా మధ్యలోనే అగిపోయిందని వెల్లడించింది. ఆ తర్వాత క్యా కెహనా అనే సినిమాకి సంతకం చేసినట్లు చెప్పింది. కానీ తన మూడో సినిమా దిల్ సే ముందే రిలీజ్ అయినట్లు తెలిపింది. దీంతో ప్రేక్షుకులు తన మొదటి చిత్రం దిల్ సే అనుకుంటున్నారని పేర్కొంది. 1998లో మణిరత్నం దర్శకత్వంలో షారుఖ్ ఖాన్, మనీషా కొయిరాల సరసన నటించిన 'దిల్ సే..' చిత్రంతో ఆమెకు మంచి గుర్తింపు లభించింది. ఆ తర్వాత ప్రీతి 90వ దశకం చివరిలో, 2000వ దశకం ప్రారంభంలో అత్యంత ఆదరణ పొందిన నటీమణుల లో ఒకరిగా ఎదిగింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.